RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 3 సంచిక : 5 మేడ్చల్ మల్కాజ్‌గిరి 30 జనవరి 2025 గురువారం పేజీలు : 4

## ఢిల్లీ ఎన్నికల వేళ డేరా బాబాకు మళ్లీ పెరోల్

చండీగఢ్ : అత్యాచారం, హత్య కేసుల్లో జీవితకాల జైలు శిక్ష అనుభవిస్తున్న డేరా సచ్చా సౌదా అధిపతి గుర్మీత్ రాం రహీమ్ సింగ్‌కు 30 రోజుల పెరోల్ మంజూరయింది. ఆయన హరియా ణాలోని సునారి యా జైలు నుంచి విడుదలయ్యాడు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాం రహీమ్‌కు పెరోల్ లభించ డం గమనార్హం. గతంలో కూడా హరియాణా, పంజా బ్, రాజస్థాన్‌లలో జరిగిన స్థానిక ఎన్నికలు, ఉప ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పలుమార్లు రాంరహీమ్‌కు 20 నుంచి 50 రోజులపాటు పెరోల్ లభించింది. లోక్‌సభ ఎన్నికల సమయంలోనూ పెరోల్ మీద విడుదలయ్యాడు. గత ఐదేళ్లలో మొత్తం 14సార్లు రాం రహీమ్‌కు పెరోల్ లభించింది. డేరా బాబాగా పేరొందిన ఈయనకు పంజాబ్, రాజస్థాన్, హరియాణాల్లో భారీగా అనుచరులు ఉన్నారు.




## పంచాయితీ ఎన్నికలపై...
# ప్రభుత్వం తర్జన భర్జన

హైదరాబాద్, జనవరి 29: పంచాయితీ ఎన్నికలపై తెలంగాణ ప్రభుత్వం తర్జనభర్జనకు గురవుతోంది. డెడికేషన్ కమిషన్ రిపోర్ట్ వచ్చిన తర్వాత ఎన్నికల నిర్వహణకు వెళ్లాలని నిర్ణయించింది. ఫిబ్రవరి 2లోపు డెడికేషన్ కమిషన్ రిపోర్టు ఇవ్వనుంది. రిపోర్టు వచ్చిన తర్వాత మరోసారి అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించనున్నారు. మరోవైపు ఫిబ్రవరిలోనే పంచాయితీ ఎన్నికలు నిర్వహించాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఇంటిగ్రేటెడ్ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పంచాయితీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు (బుధవారం) సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి రేవంత్‌తో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎస్ శాంతికుమారి సహా పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే గురించి చర్చించారు. ఇంటింటి కుటుంబ సర్వేను విజయవంతంగా పూర్తి చేసిన అధికారులను సీఎం అభినందించారు. అయితే ఈ సమావేశంలో పంచాయితీరాజ్ ఎన్నికలపై ఓ నిర్ణయం తీసుకుంటారని అంతా భావించారు. కానీ పంచాయతీ ఎన్నికలపై తెలంగాణ ప్రభుత్వం తర్జన భర్జనకు గురవుతోంది. కులగణను సంబంధించిన ముసాయిదా సిద్ధమైనప్పటికీ ఇంకా ఫైనల్ రిపోర్టును డెడికేషన్ కమిషన్ ఇవ్వలేదు. ఫిబ్రవరి 2 లోపు కేబినెట్ సబ్ కమిటీకి అందిస్తామని డెడికేషన్ కమిషన్ ప్రభుత్వానికి తెలిపింది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 2 తరువాత మరోసారి సమావేశమై పంచాయతీ ఎన్నికలపై ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుకు ఉన్న అవకాశాలను ప్రభుత్వం అన్వేషిస్తోంది. రిజర్వేషన్లపై పాత పద్ధతిలోనే వెళ్లాలా లేక న్యాయ స్థానాలలో పెంచుకునే అవకాశం పొందాలా అనేదానిపై సర్కార్ తర్జన భర్జనకు గురవుతోంది. న్యాయ నిపుణుల సలహా మేరకు ముందుకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే పంచాయితీల్లో గతేడాది 2024, ఫిబ్రవరి1న సర్పంచ్ పదవీకాలం ముగియగా.. ప్రత్యేక అధికార పాలన వచ్చింది. రిజర్వేషన్లపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే 15 రోజుల్లో ఎలక్షన్స్ నిర్వహిస్తామని ఎన్నికల సంఘం అధికారులు చెబుతున్నారు.




తెలంగాణ పీసీసీకి నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు రానున్నారు. ఇప్పటికే ఇద్దరి పేర్లు దాదాపు ఖరారు కాగా.. మరో రెండు పోస్టుల కోసం నాలుగు పేర్లను పార్టీ రాష్ట్ర నాయకత్వం హైకమాండ్ కు పంపించింది.

భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి వర్కింగ్ ప్రెసిడెంట్ (ఆర్గనైజేషన్), మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ కు వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టులు ఖాయమైనట్లు తెలిసింది. ఇక మూడో వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి కోసం మాదిగ సామాజిక వర్గం నుంచి కరీంనగర్ జిల్లా మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ పేర్లు పంపించగా, ఒకరిని హైకమాండ్ ఎంపిక?చేయనుంది. నాలుగో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టు కోసం బీసీ మహిళా నేతను ఎంపికచేయనున్నారు. ఈ పోస్టు కోసం గద్వాల జడ్పీ మాజీ చైర్ పర్సన్ సరితా యాదవ్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావు పోటీ పడుతున్నారు.

**మహిళా నేతల మధ్య తీవ్ర పోటీ..** నాలుగో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టు కోసం ఇద్దరు మహిళా నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఇటు మహిళ, అటు బీసీ కోటా కింద గద్వాల జడ్పీ మాజీ చైర్ పర్సన్ సరితా యాదవ్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావు (ముదిరాజ్)లలో ఎవరిని ఫైనల్‌చేస్తారోననే ఉత్కంఠ పార్టీ వర్గాల్లో నెలకొంది. సరితా యాదవ్ పేరును సీఎం రేవంత్ రెడ్డి సిఫారసు చేయగా, సునీతా రావు పేరును ఢిల్లీ పెద్దలు సూచిస్తున్నట్లు సమాచారం. ఆరు నెలల కిందే మహిళా కాంగ్రెస్ చీఫ్ పోస్టు కోసం సరితా పేరును సిఫారసు చేస్తూ స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి ఆ విభాగం నేషనల్‌చీఫ్ అల్కా లంబాకు లేఖ పంపించారు.

దీన్ని పసిగట్టిన సునీతా రావు తనకున్న పరిచయాలతో ఢిల్లీలో లాబీయింగ్ చేసి తన పదవిని కంటిన్యూ చేసుకుంటూ వస్తున్నారు. దీంతో సరితకు కనీసం వర్కింగ్ పోస్టు ఇవ్వాలని రేవంత్ పట్టుబడుతుండగా, మహిళతో పాటు బీసీ కోటాలో ఈ పదవి తనకే ఇవ్వాలని సునీతారావు గట్టి ప్రయత్నాలే చేస్తున్నారు. దీంతో సరిత, సునీతలలో ఈ పదవి ఎవరిని వరించనుందనేది ఆసక్తి రేపుతోంది.




# 'పద్దు'కు వేళాయె...!

న్యూఢిల్లీ: ఈ నెల 31 నుంచి బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. శుక్రవారం లోక్‌సభలో పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారు. శనివారం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సాధారణ బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. శుక్రవారం ఆర్థిక మంత్రి ఆర్థిక సర్వేను ప్రవేశపెడతారు. ఆ సమయంలో రాష్ట్రపతి ప్రసంగం తర్వాత లోక్‌సభ, రాజ్యసభ కొద్దిసేపు సమావేశమవుతాయి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ కోసం లోక్‌సభ రెండు రోజులు (ఫిబ్రవరి 3, –4) కేటాయించగా, రాజ్యసభ మూడు రోజులు కేటాయించింది. ఫిబ్రవరి 6న రాజ్యసభలో జరిగే చర్చకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమాధానం ఇస్తారని భావిస్తున్నారు. బడ్జెట్ సమావేశాలు సజావుగా జరిగేలా చూసేందుకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు ఈ నెల 30న పార్లమెంటులో రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. బడ్జెట్ సమావేశాల ఫస్ట్‌సెషన్‌ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు తొమ్మిది సమావేశాలు జరుగుతాయి. ఆ తర్వాత ఫిబ్రవరి 13న బడ్జెట్ ప్రతిపాదనలను పరిశీలించడానికి పార్లమెంటు విరామం తీసుకుంటుంది. వివిధ మంత్రిత్వ శాఖల గ్రాంట్ల డిమాండ్లను చర్చించడానికి, బడ్జెట్ ప్రక్రియను పూర్తి చేయడానికి మార్చి 10 నుంచి తిరిగి సమావేశమవుతుంది. ఈ సమావేశాలు ఏప్రిల్ 4న ముగుస్తాయి.

## కుంభమేళాలో...
# తొక్కిసలాట బీభత్సం!
## పదుల సంఖ్యలో భక్తుల మృతి!!




హైదరాబాద్ : యూపీలోని ప్రయాగ్ రాజ్లో కొనసాగుతున్న మహాకుంభమేళాలో తీవ్ర విషాదం నెలకొంది. అనుకోకుండా భక్తులు ఎక్కువ సంఖ్యలో రావడంతో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో సుమారు 20 మందికి పైగా మృతి చెందినట్లు తెలుస్తోంది. వందకు పైగా భక్తులు గాయపడినట్లు సమాచారం. క్షతగాత్రులను వెంటనే స్థానికంగా ఏర్పాటు చేసిన శిబిరాల్లోకి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషాదంపై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శిబిరాల్లో చికిత్స పొందుతున్నవారిని వెంటనే ఆస్పత్రులకు తరలించి చికిత్స అందించాలని అధికారుకలకు సూచించారు. ప్రస్తుతం పవిత్ర స్నానాలను రద్దు చేస్తూ యూపీ సర్కార్ నిర్ణయం తీసుకుంది. బుధవారం తెల్లవారు జామున బారీకేడ్లు విరిగిపడటంతో భక్తులు ఒకరిమీద ఒకరు పడటంతో తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ ఘటనలో 50 మందికి పైగా భక్తులు గాయపడినట్లు తెలుస్తోంది. భారత కాలమానం ప్రకారం బుధవారం ఉదయం పుణ్య స్నానాలకు 10కోట్ల మంది తరలివచ్చినట్లు అంచనా వేస్తున్నారు అధికారులు. మౌని అమావాస్య సందర్భంగా ఈరోజు ఉదయం దాదాపు 2కోట్ల 8లక్షల మంది యాత్రికులు స్నానాలు ఆచరించినట్లు అధికారులు తెలిపారు. జనవరి 13 న పండుగ ప్రారంభమైనప్పటి నుండి దాదాపు 20కోట్లమంది ప్రజలు నదిలో స్నానాలు చేశారని తెలిపారు.ప్రయాగ్‌రాజ్‌లోని కుంభమేళా ఉత్సవంలో బుధవారం ఉదయం జరిగిన తొక్కిస లాటలో కనీసం 12మంది మరణించారని ఉంటారని ప్రత్యక్ష సాక్షులు , ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. అయితే మృతుల సంఖ్యపై ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి సమాచారం లేదు.

**ప్రధాని మోదీ ఆరా..** తొక్కిసలాట ఘటన నేపథ్యంలో యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు ప్రధాని మోదీ ఫోన్ చేశారు. గంటల వ్యవధిలో మూడు సార్లు సీఎంతో మాట్లాడి తాజా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అటు కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా ఘటనపై ఆరా తీశారు. మరోవైపు, సీఎం యోగి భక్తులకు విజ్ఞప్తి చేశారు. "త్రివేణి సంగమం ప్రధాన కేంద్రం వద్దకు రాకుండా సమీపంలోని ఘాట్ల వద్ద పుణ్యస్నానాలు ఆచరించండి. ఆదేశాలు, సూచనలను పాటిస్తూ అధికారులకు సహకరించండి. ఎలాంటి వదంతులను నమ్మొద్దు" అని యూపీ సీఎంఓ ప్రకటన విడుదల చేసింది. తాజా పరిస్థితులపై యోగి ఆదిత్యనాథ్ మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్ష చేపట్టారు.

**కుంభమేళా మార్గంలో భారీ ట్రాఫిక్ జామ్...** ఇదిలా ఉండగా.. కుంభమేళాకు భక్తులు పోటెత్తడంతో అటుగా వెళ్లే జాతీయ రహదారిపై భారీ రద్దీ నెలకొంది. దాదాపు 20 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

# సంపాదకీయం

## ఢిల్లీ ఓటరు షాక్ ఇస్తాడా ?

దేశంలో ఇపుడు అందరికీ ఆకట్టుకుంటున్న ఎన్నికలు ఢిల్లీ శాసనసభకు ఫిబ్రవరి 5న జరిగేవిగా ఉన్నాయి. ఈ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారు అన్నది దేశంలో రాజకీయాల పట్ల అవగాహన ఆసక్తి ఉన్న వారిలో ఉత్సాహం పెంచుతోంది. అదే సమయంలో ఢిల్లీ ఓటర్లు మాత్రం పెద్దగా ఈ ఎన్నికల పట్ల ఆసక్తిని చూపించడం లేదు అని అంటున్నారు. వారిలో ఒకింత ఎన్నికల వైరాగ్యం కూడా ఏర్పడింది అని అంటున్నారు. ఎవరు వస్తేనేమిటి అన్న భావనతో ఢిల్లీ ఓటరు ఉన్నారని అంటున్నారు. ఇంతలా నిరుత్సాహం ఎందుకు అంటే ఆప్ ప్రభుత్వం మీద కోటి ఆశలు పెంచుకుని పన్నెండేళ్ళుగా మోశారు. అయితే ఆప్ కొన్ని మంచి పనులు చేసినా ఇంకా చాలా చేయాల్సినవి ఉన్నాయి. ముఖ్యంగా ఢిల్లీ వాసులకు స్వచ్ఛమైన గాలి కావాలి. కాలుష్యం కోరలలో ఢిల్లీ చిక్కుకుంది. దానికి పరిష్కారం అయితే లేదు. అంతే కాదు ఆప్ అధినేత కేజ్రీవాల్ కొత్తగా ముఖ్యమంత్రి అయినపుడు సాదా సీదాగా కనిపించే వారు. అందరి మాదిరిగానే పబ్లిక్ ట్రాన్స్‌పోర్టులో ప్రయాణం చేసేవారు. అయితే ఆయన అత్యాధునికమైన శీష్ మహల్ భవనం కట్టుకున్నారు అని బీజేపీ ఆరోపిస్తోంది. జనాలు కూడా దాని మీద చర్చించుకుంటున్నారు. ఇక లిక్కర్ స్కాం ఉండనే ఉంది. దీనిని నమ్మే వారూ నమ్ముతున్నారు. ఏది ఏమైనా పూర్వం మాదిరిగా అయితే అరవింద్ కేజ్రీవాల్ క్రేజ్ అయితే లేదు అని అంటున్నారు. ఇక బీజేపీ విషయానికి వస్తే కేంద్రంలో అధికారంలో ఉన్న ఆ పార్టీ ఢిల్లీ కాలుష్యంతో పాటు స్థానిక సమస్యల మీద తన వంతుగా స్పందించలేదు అన్న ఆగ్రహం ఉంది. ఎంతసేపూ ఆప్ ని విమర్శించడం తప్ప తాము చేసింది ఏమిటి అని ప్రజలలో ఆగ్రహం ఉంది అంటున్నారు అంతే కాదు ఢిల్లీలో గెలిచిన ఆప్ ని సరిగ్గా పాలించకుండా లెఫ్టినెంట్ గవర్నర్ అధికారాలను పెంచేసారు అన్నది కూడా జనంలో చర్చగా ఉంది. బీజేపీ వచ్చినా ఏమి ఉంటుంది అన్న నిర్వేదం కూడా జనాలలో ఉందట. సందట్లో సడేమియా అన్నట్లుగా కాంగ్రెస్ పోటీ చేస్తోంది అని అంటున్నారు. ఆ పార్టీ గెలుస్తుంది అని వారే అనుకోవడం లేదు. కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం కూడా పెద్దగా ఫోకస్ చేయడంలేదు. ఇక జనాలు దుకు ఆ వైపు చూస్తారు అని అంటున్నారు. మొత్తంగా చూస్తే ఫలనా పార్టీని గెలిపించాలి వారితో తమ జీవితాలను బంగారం చేసుకోవాలన్న పట్టుదల కానీ కోరిక కానీ ఆకాంక్షలు కానీ పెద్దగా లేని ఈ ఎన్నికలు ఈసారి ఏ రకమైన ఫలితాన్ని ఇస్తాయో అని అంతా అంటున్నారు. మరి పోలింగ్ గతసారి కంటే మించుతుందా తగ్గుతుందా అన్నద్ దానిని బట్టి ఢిల్లీ ఓటరు తీర్పు అర్థం అయిపోతుంది అని అంటున్నారు.

# విద్యతో పాటు క్రీడలకు తగు ప్రాధాన్యం ఇవ్వాలి : జిల్లా కలెక్టర్ గౌతమ్

### తూంకుంట పరిధిలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ ను సందర్శించి పరిశీలించిన జిల్లా కలెక్టర్





శామీర్ పేట, (గరుడ వార్త) : విద్యతో పాటు క్రీడలకు తగు ప్రాధాన్యం ఇవ్వాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతం తెలిపారు. బుధవారం శామీర్ పేట మండలం తూంకుంట పరిధిలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ ను కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలలో విద్యార్థులు రాణించి మంచి గుర్తింపు పొందాలని సూచించారు. స్పోర్ట్స్ స్కూల్‌లో రాకెట్ క్రీడలను ప్రవేశపెట్టి ఆ దిశగా విద్యార్థులను ప్రోత్సహించాలని స్కూల్ స్పెషల్ ఆఫీసర్ కు తెలిపారు. టెన్నీస్, బ్యాడ్ మెంటన్, టేబుల్ టెన్నిస్ వంటి రాకెట్ క్రీడలను తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశపెట్టాలని స్పెషల్ ఆఫీసర్ కు కలెక్టరు సూచించారు. స్కూలులో ఎంత మంది విద్యార్థులు ఉన్నారని, వారికి విద్యతోపాటు క్రీడలలో ఏవిధంగా శిక్షణను ఇస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల తరగతి గదులు, క్రీడల ప్రాక్టీస్ హాళ్లను, గ్రౌండ్స్, డైనింగ్ హాళ్లను కలియ తిరిగి పరిశీలించారు. విద్యార్థులకు అందించే మెనూ చార్టును పరిశీలించి మెను ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. క్రీడల ప్రాక్టీస్ హాల్‌లో పరికరాలను పరిశీలించి వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. ఓపెన్ గ్రౌండ్స్ లలో వీక్షకులకు సిట్టింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. తెలంగాణ స్టేట్ స్పోర్ట్స్ స్కూల్ స్పెషల్ ఆఫీసర్ సుధాకర్ రావు ప్రస్తుతం స్కూల్ లో 4 వ తరగతి నుంచి 12వ తరగతి వరకు 430 మంది విద్యార్థులు ఉన్నారని, ప్రతి సంవత్సరం 40 మంది విద్యార్థులను చేర్చుకోవడం జరుగుతుందని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు క్లాసులు జరుగుతాయని, ఉదయం సాయంత్రం క్రీడల ప్రాక్టీసు ఉంటుందని చెప్పారు. మెడికల్ రూంలో మెడికల్ ఆఫీసర్, మెడిసిన్, ఫిజియోథెరపి అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి గోపాల్ రావు, స్కూల్ ప్రిన్సిపల్ ప్రకాష్, మెడికల్ ఆఫీసర్ ప్రేమ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# శామీర్ పేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలకు కంప్యూటర్లను, వాటర్ ఫిల్టర్ ను అందజేసిన ఐడీబీఐ బ్యాంక్




శామీర్ పేట, (గరుడ వార్త) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసిస్తున్న విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు గాను తమ వంతు కృషి చేస్తున్నామని ఐడీబీఐ ప్రాంతీయ కోఆర్డినేటర్ ప్రియ తెలిపారు. బుధవారం సీఎస్ఆర్ యాక్టివిటి లో భాగంగా శామీర్ పేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాయక్ లకు ఐడీబీఐ బ్యాంక్ ప్రాంతీయ కోఆర్డినేటర్ ప్రియ, ఐడీబీఐ శామీర్ పేట బ్రాంచ్ మేనేజర్ గౌతమి లు కంప్యూటర్లు, వాటర్ ఫిల్టర్ అందజేశారు. ఈ సందర్భంగా ఐడీబీఐ ప్రాంతీయ కోఆర్డినేటర్ మాట్లాడుతూ సీఎస్ఆర్ కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలలకు తమ బ్యాంకు సేవలందిస్తుందన్నారు. విద్యార్థులకు అవసరమయిన సౌకర్యాలను కల్పిస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే పేద విద్యార్థులకు చేయూతనిచ్చి వారి ఆశయాన్ని నేరవేర్చుటకు ఐడీబీఐ సహకారమందిస్తుందని ఆమె తెలిపారు. తమ పాఠశాలలకు కంప్యూటర్లు,




వాటర్ ఫిల్టర్ అందజేసినందుకు ఐడీబీఐ బ్యాంక్ అధికారులకు ప్రధానోపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐడీబీఐ బ్యాంక్ సిబ్బంది,పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# షీ టీం ల ప్రధాన లక్ష్యం మహిళల భద్రత : షీ టీం ఇన్చార్జి ఎస్ఐ శ్రీనివాస్



శామీర్‌పేట, (గరుడ వార్త) : షీ టీంలు ప్రధానంగా మహిళలకు భద్రత కల్పిస్తాయని షీ టీం ఇన్చార్జి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో షీ టీం పేట్ బషీరాబాద్ డివిజన్ శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో షీ టీంపై ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. షీ టీం అంటే ఏమిటి, అది ఎలా పనిచేస్తుంది, మహిళలకు ఏ విధంగా ఉపయోగపడుతుందో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీంపై ఎస్సై శ్రీనివాస్ మాట్లాడుతూ ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, ఫోన్ కాల్స్, సోషల్ మీడియాలో వేధింపులు, బాల కార్మికుల వేధింపులు, బాల్య వివాహాలు, స్మైల్ టీం గురించి తెలిపారు. ప్రభుత్వం మహిళలకు పూర్తి భద్రత కల్పించాలనే ఉద్దేశంతోనే షీ టీం ఏర్పాటు చేసిందన్నారు. షీ టీంను ఎలా సంప్రదించాలనే విషయాలను, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 కి కాల్ చేయాలి, లేదా నేరుగా కార్యాలయంలో సంప్రదించవచ్చని ఆయన చెప్పారు. ఫిర్యాదుదారుల వివరాలు కచ్చితంగా రహస్యంగా ఉంటాయని, మహిళల రక్షణ కోసమే ఎల్లవేళలా షీ టీం అందుబాటులో ఉంటుందని, ఎవరైనా వేధింపులకు గురైతే నిశ్శబ్దంగా ఉంటూ బాధపడకూడదన్నారు. ఆపదలో ఉన్న మహిళలకు సహాయం అందించేందుకే షీ టీం ఉందని భరోసా ఇచ్చారు. సుమారు 150 మంది బాలురకు, 200 మంది మహిళలకు షీ టీంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీం ఇన్చార్జ్ తుల్జారాం, కానిస్టేబుళు వెంకటేష్, రాజేష్, అనూష, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్, ఉపాధ్యాయులు, బాలురు, మహిళలు పాల్గొన్నారు.

# ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా నియమించడంతో బాధ్యత నాపై మరింతగా పెరిగింది... గోనె హనుమంత రెడ్డి...



శామీర్ పేట, (గరుడ వార్త) : ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించడంతో తనపై బాధ్యత మరింతగా పెరిగిందని, నూతనంగా నియమితులైన గోనె హనుమంత రెడ్డి తెలిపారు. బుధవారం నగరంలోని ట్రస్మా రాష్ట్ర కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తుంకుంటలోని శ్రీ విజ్ఞాన భారతి స్కూల్ రెస్పాండెంట్ గోనె హనుమంతరెడ్డిని ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షునిగా నియమించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన రాష్ట్ర అధ్యక్షునికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. నర్సిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కే అనిల్ కుమార్, కోశాధికారి కే శ్రీకాంత్ రెడ్డి, అధికార ప్రతినిధి చింతల రామచందర్, కోఆర్డినేటర్ రామ్ రెడ్డి ,అసోసియేటెడ్ ప్రెసిడెంట్ కె రామేశ్వర్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ సోమశేఖర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# గుప్పుమంటున్న గంజాయి

బోథ్ : జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లోని యువతే లక్ష్యంగా అక్రమార్కులు గంజాయిని సరఫరా చేస్తున్నారు. దీంతోపాటు ఇక్కడి నుంచి వేరే జిల్లాలకు గుట్టుచప్పుడు కాకుండా సరఫరా అవుతోంది. డబ్బు సంపాదనే లక్ష్యంగా అటవీ ప్రాంతంలోని ఖాళీ స్థలాలను గుర్తించి వాటిలో సాగు చేస్తున్నారు. ఈ ఏడాది 75 గంజాయి కేసులు నమోదవగా దాదాపు రూ. 2. 31 కోట్ల విలువైన 9. 87 క్వింటాళ్ల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. జిల్లాలో గ్రామీణ యువత పట్టణాలకు ద్విచక్రవాహనాలపై, ఎవరికీ అనుమానం రాకుండా బస్సుల్లో తరలిస్తున్నారు. హైదరాబాద్‌లాంటి నగరాలకు ద్విచక్రవాహనాలపై సరఫరా చేస్తున్నారు. గంజాయికి అలవాటుపడ్డ పలువురు యువకులు కార్లలో గ్రామీణ ప్రాంతాలకు వచ్చి కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం.

**ఇటీవలి ఘటనలు ..**



బోథ్ మండలంలోని సొనాలకు చెందిన ఓ కిరాణ వ్యాపారి తన ఇంట్లో గంజాయిని నిల్వ చేసుకొని ఉంచుకోగా పోలీసులు దాడి నిర్వహిం చారు. ఇంట్లో నిల్వ ఉన్న రెండు కిలోల గంజాయిని పట్టుకున్నారు. బోథ్ మండలం గుట్టపక్కతండాకు చెందిన ఓ వ్యక్తి హైదరాబాద్, నిజామాబాద్, కరీంనగర్‌లాంటి పట్టణాలకు కొంతకాలంగా గంజాయిని సరఫరా చేస్తున్నాడు. ఇటీవల కామారెడ్డి జిల్లాలో గంజాయితో పలువురు పట్టుబడగా చరవాణిలో మండలానికి చెందిన వ్యక్తి వివరాలు బయటపడ్డాయి. దీంతో భిక్కనూరుకు చెందిన పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు.

బేల మండలానికి చెందిన పలువురు గంజాయిని పండించి వేరే ప్రాంతానికి సరఫరా చేస్తుండగా పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వారి నుంచి దాదాపు 1.18 కిలోల గంజాయిని పట్టుకున్నారు. 18 గంజాయి మొక్కలను గుర్తించారు.

మావల మండలానికి చెందిన ఓ వ్యక్తి గంజాయిని ద్విచక్రవాహనంపై తరలిస్తుండగా మెదక్ జిల్లా రామాయంపేట పోలీసులు జాతీయ రహదారిపై తనిఖీ నిర్వహిస్తుండగా పట్టుకున్నారు.

తలమడుగు మండలంలోని లక్ష్మీపూర్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు వేరే రాష్ట్రం నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న దాదాపు రూ. 2. 25 కోట్ల విలువైన గంజాయిని పట్టుకున్నారు.

అనుమానం వచ్చి..ఇటీవల బోథ్ మండలంలోని పొచ్చర ప్రయాణ ప్రాంగణంలో నేరడిగొండ మండలం రాజులతండాకు చెందిన చందర్‌సింగ్ అనే వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించటంతో పోలీసులు తనిఖీలు చేశారు. అతడి వద్ద గంజాయి లభించింది. సొనాలలో సైతం దేరా గ్రామానికి చెందిన నారాయణ గంజాయి పొట్లాలను అమ్ముతుండగా పోలీసులు పట్టుకున్నారు. అతని ఇంటి వద్ద పెరటిలోని గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు.

**ఉక్కుపాదం మోపుతాం : జీవన్ రెడ్డి, డీఎస్పీ**

జిల్లాలో గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నాం. ప్రత్యేక తనిఖీలు నిర్వహించి గంజాయి పండించే వారిని, సరఫరా చేసే వారిని పట్టుకొని కేసులు నమోదు చేస్తాం. గంజాయిని తరలిస్తూ దొరికిన వాహనాలను సీజ్ చేస్తున్నాం. మహారాష్ట్ర నుంచి సరఫరా చేస్తున్న వారిపై సైతం నిఘా పెట్టాం.

ఈ సంవత్సరం నమోదైన గంజాయి కేసులు: 75
పట్టుకున్న గంజాయి : 9. 87 క్వింటాళ్లు
దీని విలువ : 2. 31 కోట్లు

# ఇదేం చోద్యం.!

ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ పట్టణంలో అనేకచోట్ల ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నాయి. పాత ఆర్టీఓ కార్యాలయం సమీపంలో రహదారి పక్కన, అటవీశాఖ చెక్‌పోస్టు ఎదురుగా, పాత కలెక్టరేట్ భవనం, చిర్రకుంట వెళ్లే మార్గంలో.. పూర్తిగా ప్రభుత్వ భూమి ఉంది. అయితే ఇవి కాదని డీఆర్‌డీఏ అధికారులు జిల్లా కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న బాబాపూర్ వెళ్లే మార్గంలో మహిళా సమాఖ్యకు స్థలం కేటాయించడం విమర్శలకు తావిస్తోంది. ఈ స్థలంలో రైతులు వ్యవసాయం చేసుకుంటున్నారు. మరోవైపు దూరభారం కానుందని మహిళలు వాపోతున్నారు.కబ్జాలకు పాల్పడిన స్థలాలను గతంలో ప్రత్యేక సర్వే చేసి, అధికారులు పట్టణంలో ప్రభుత్వ స్థలాలను గుర్తించారు. ఈ ప్రాంతాల్లో సర్కారు స్థలాలు అని బోర్డులు సైతం ఏర్పాటు చేశారు. స్థలాలు అందుబాటులో ఉన్నప్పటికీ.. పట్టణానికి దూరంగా మహిళా సంఘ భవనం కోసం స్థలాన్ని ఎంపిక చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో సైతం ఇదే స్థలం ఎంపిక చేసినప్పుడు, మహిళల నుంచి నిరసన వ్యక్తంకాగా రద్దు చేశారు. తాజాగా ఈ స్థలం ఎంపిక చేయడంతో వివాదం మళ్లీ మొదటికి వచ్చింది. పట్టణంలోని ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు ఖాళీగా ఉన్నాయి. ఇవి క్రమంగా అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే పాత ఆర్టీఓ కార్యాలయం పక్కన రహదారిని ఆనుకుని స్థలంలో ఓ వ్యక్తి సిమెంటు స్తంభాలు సైతం పాతారు. ఈ తరుణంలో సర్కారు స్థలాలను ఇతరులకు కట్టబెట్టే యోచనతోనే కాసులు తీసుకుని సంబంధిత అధికారులు బాబాపూర్ వెళ్లే మార్గంలో స్థలం కేటాయించినట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు మహిళలకు స్థానికంగా అందుబాటులో ఉండే స్థలాన్నే మహిళా సమాఖ్య కోసం ఎంపిక చేయాలనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

అటవీ చెక్‌పోస్టు ఎదురుగా బీడీపీపీ భూములు భారీగా కబ్జాలకు గురవుతున్నాయి. ఇటీవలే అధికారులు నామమాత్రంగా కబ్జాలకు గురైన కాలువ మట్టిని తొలగించారు. ఇదే ప్రాంతంలో గతంలో మహిళలు కబ్జాలను తొలగించారు. ఈ స్థలంలోనే భవనం నిర్మించాలని మహిళలు కోరారు.

# సర్కారు బడి.. అభివృద్ధి ఒరవడి

ఖమ్మం : పీఎంశ్రీ పథకం కింద సర్కారు పాఠశాలలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. ప్రస్తుతం వివిధ పనులకు ఎంపిక చేసిన మొత్తం 28 పాఠశాలలకు రూ.2 కోట్లు మంజూరయ్యాయి. వచ్చే మూడు నెలల్లోనూ పెద్ద ఎత్తున నిధులు మంజూరయ్యే అవకాశముంది. వీటిలో 60 శాతం కేంద్ర ప్రభుత్వం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తోంది. వచ్చే మార్చి నాటికి పనులు పూర్తి చేయాలి. లేకుంటే ఇవి మురిగిపోయే ప్రమాదముంది. నిధులు సకాలంలో ఖర్చు చేసేందుకు ఆయా పాఠశాలల, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో ఇటీవలే జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ ఈ పథకంపై ప్రత్యేక శ్రద్ధపెట్టి నిత్యం పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను సకాలంలో ఖర్చు చేయాలని డీఈఓ ఈ.సోమశేఖరశర్మ, జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ సీహెచ్ రామకృష్ణ కోరారు.

**పాఠశాలలకు సౌకర్యాలు**

జిల్లాలోని ఎంపీపీఎస్ సత్తుపల్లి, ఎంపీపీఎస్ సిరిపురంలో ప్రీప్రైమరీ విద్య అభివృద్ధికి అంగన్‌వాడీలను ఆధునికీకరించారు. గదుల లోపల రంగులు వేయడంతో పాటు ఫర్నిచర్, ఆట పరికరాలను కొనుగోలు చేశారు. సిబ్బంది నియామకం, ఇతర అవసరాలన్నింటికీ కలిపి రూ.9 లక్షల వరకు ఖర్చు చేశారు.

స్కూల్ గ్రాంటు కింద రూ.లక్ష మంజూరు చేశారు. ఈ నిధులతో చిన్నచిన్న మరమ్మతులు చేసుకునే అవకాశం ఉంటుంది. గదులకు రంగులు వేయించుకోవడం, అవసరమైన పేపర్లు, పుస్తకాలు కొనుగోలు చేసుకోవచ్చు. దివ్యాంగులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు



రూ.5 వేలు, ఎల్‌ఈడీ విద్యుద్దీపాలకు రూ.5 వేలు మంజూరు చేశారు. పాఠశాలలో పచ్చదనం పెంపొందించుకునేందుకు రూ.10 వేలు మంజూరయ్యాయి. పాఠశాల ప్రాంగణంలోని చెత్తాచెదారం, కిచెన్‌లో వ్యర్థ పదార్థాలు తదితర వాటితో వర్మీ కంపోస్టు తయారు చేసుకునేందుకు రూ.5 వేలు మంజూరు చేశారు. కిచెన్ గార్డెన్‌కు రూ.20 వేలు, డస్ట్‌బిన్‌లకు రూ.2 వేలు, స్వచ్ఛ పక్వాడకు రూ.10 వేలు, మ్యాథ్స్, సైన్స్ సర్కిళ్ల అభివృద్ధి కోసం రూ.10 వేల చొప్పున మంజూరు చేశారు.

**పర్యావరణంపై అవగాహన**

విద్యార్థులకు మొక్కల పెంపకం, పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు అటవీశాఖ సహకారం తీసుకుంటున్నారు. ఖమ్మం నగర సమీపంలోని వెలుగుమట్ల అటవీశాఖ అర్బన్ పార్కు, సత్తుపల్లి సమీపంలోని నీలాద్రి అర్బన్ పార్కులను ఎంపిక చేశారు. జిల్లాలో మొత్తం 8 వేల మంది విద్యార్థులకు నిపుణులతో అవగాహన కల్పిస్తారు. అక్కడే క్షేత్ర సందర్శనలు ఏర్పాటు చేస్తారు. ప్రతి విద్యార్థికి రూ.500 చొప్పున మంజూరు చేశారు. వీటితో నిపుణులకు గౌరవ వేతనం ఇవ్వడంతోపాటు విద్యార్థుల భోజనం కోసం ఖర్చు చేస్తారు.

# కబ్జా దారి!

మధిర : నియోజకవర్గ కేంద్రం మధిరలో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయి. వీటిల్లో ర.భ. శాఖ స్థలాలే ఎక్కువగా ఉన్నాయి. వీటికి సంబంధించిన ఓ దస్త్రం మాయంకావడం కొసమెరుపు. మధిర–రాయపట్నం రహదారిలో వైరానదిపై వంతెన నిర్మాణానికి 1976లో 11 ఎకరాల భూమిని సేకరించారు. పనులకు కావాల్సిన మట్టిని తోలేందుకు రైల్వేట్రాక్ పక్కన మరో పదెకరాలు కేటాయించారు. ఎర్రుపాలెం మండలం మీనవోలు వద్ద కట్లేరుపై వంతెన నిర్మాణ సమయంలో రెండెకరాల ప్రభుత్వ భూమిని సేకరించారు. సంబంధిత భూ యజమానులకు పరిహారాన్నిచ్చారు.



ఇపుడు ఆ భూమలు ఆక్రమణకు గురయ్యాయి.

**మధిర బైపాస్‌లో..**

మధిర బైపాస్ నిర్మాణాన్ని 1983లో చేపట్టారు. మార్కెట్ యార్డు సమీపం నుంచి దర్గా వరకు వంద అడుగులు, అక్కడ్నుంచి వంతెన వరకు 130 అడుగుల చొప్పున భూమిని సేకరించారు. ఆ భూమికి అధికారులు హద్దులు నిర్ధారించి రాళ్లు పాతించారు. ఆ రాళ్లు ప్రస్తుతం కనిపించకుండా పోయాయి. వీటికి సంబంధించిన దస్త్రం ఆ శాఖ కార్యాలయంలో మాయమైంది. బ్రిడ్జి కుడివైపున డంపింగ్ యార్డు ప్రాంతంలోనూ అప్పట్లో కొంత భూమిని సేకరిస్తే.. అందులో సుమారు మూడెకరాలను తప్పుడు ధ్రువపత్రాలపై ఓ వ్యక్తికి ధారాదత్తం చేశారనే ఆరోపణలున్నాయి. ప్రస్తుతం ఇక్కడ ఎకరం రూ.40 లక్షలకు పైగా పలుకుతోంది. బైపాస్ ఇరువైపులా ప్రభుత్వ భూమి కబ్జాకు గురైంది. వైరానది ఒడ్డు నుంచి రాయపట్నం వెళ్లేందుకు డొంక రోడ్డు ఉండేది. ఈ రహదారిలో అప్పట్లో ఓ ప్రైవేటు బస్సు మధిర నుంచి నందిగామకు ప్రయాణికులను చేరవేసేది. వైరానది ఒడ్డున కొంతదూరం ఉండాల్సిన ఆర్అండ్‌బీ స్థలం అన్యాక్రాంతమైంది.

మధిర–దెందుకూరు డొంకదారిలో విలువైన స్థలాన్ని కొందరు ఆక్రమించుకొని విలాసవంతమైన భవనాలు నిర్మించారు. దీనిపై పలుమార్లు ఫిర్యాదులందినా అధికారుల కంటితుడుపు చర్యలు చేపట్టారు. ఇల్లెందులపాడులో ర.భ. శాఖ రహదారి పక్కనున్న 1.25 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా అయింది. సిరిపురం వద్ద వైరానదిపై నిర్మించిన బ్రిడ్జి పక్కనున్న స్థలమూ మాయమైంది.

"ర.భ.శాఖకు చెందిన స్థలాలు ఎక్కడెక్కడ ఎంత ఉన్నాయనే వివరాలు శాఖ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయి. వాటిని పరిశీలించి, ఎక్కడైనా శాఖకు చెందిన భూములు కబ్జాకు గురైతే సర్వే చేయిస్తాం. ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం. మధిర బైపాస్ భూ సేకరణ దస్త్రం కలెక్టరేట్‌లో ఉంటుంది." ఏఈ రాంబాబు, ర.భ. శాఖ

# సమస్య గుర్తింపు ఇక సులువే!



పెద్దపల్లి : ఈదురుగాలులతో విద్యుత్తు తీగలు పరస్పరం తగిలి తెగిపోవడం, ఇన్సులేటర్లు దెబ్బతినడం, స్తంభాలు నేలకొరగడం వంటి సమస్యలతో తరచూ సరఫరా నిలిచిపోతోంది. సమస్య తలెత్తిన ప్రాంతాన్ని గుర్తించేందుకు సిబ్బంది ఆపసోపాలు పడాల్సి వస్తోంది.

ఈ నేపథ్యంలో ఉత్తర విద్యుత్తు పంపిణీ సంస్థ(ఎన్‌పీడీసీఎల్) పరిష్కార చర్యలు చేపట్టింది. 33 కేవీ, 11 కేవీ స్తంభాలకు ప్రత్యేక నంబర్లను కేటాయిస్తూ జియోట్యాగింగ్‌తో అనుసంధానిస్తున్నారు. దీంతో సమస్య తలెత్తిన ప్రాంతాన్ని సులువుగా గుర్తించే వీలుంది.

**నంబర్లతో కచ్చితత్వం**

విద్యుత్తు స్తంభాలకు నంబర్లు కేటాయించడంతో వాటి ఆధారంగా సమస్య ఎక్కడ, ఎంత దూరంలో ఉందో తెలుసుకోవచ్చు. ఇదివరకు ఒక లైన్‌లో అంతరాయం ఏర్పడితే పరిధిలోని మిగిలిన లైన్లకు సరఫరా నిలిపివేసేవారు. ప్రస్తుతం సమస్య ఉన్న ఒక్క లైన్‌కు మాత్రమే నిలిపేస్తే సరిపోతుంది. దీంతో సరఫరాలో అంతరాయం తగ్గడంతో పాటు అనధికారంగా వేసిన స్తంభాల లెక్క తేలనుంది.

సెల్‌ఫోన్‌కు సందేశం

ట్రాన్స్‌ఫార్మరు ప్రాంతాన్ని సూచించేలా నంబరును స్తంభాలపై వేస్తున్నారు. ఈ ప్రక్రియ అన్ని చోట్లా పూర్తయిన తర్వాత జియోట్యాగింగ్‌కు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లా, డివిజన్, సెక్షన్ కార్యాలయాల్లో పరికరాలు సమకూర్చనున్నారు. ఈ విధానంతో సంబంధిత అధికారులు, సిబ్బంది సెల్‌ఫోన్‌లో నిక్షిప్తమవుతుంది. దీంతో ఎక్కడైనా అంతరాయం కలిగితే సందేశం వస్తుంది.

**16.72 లక్షల కనెక్షన్లు**

ఉమ్మడి జిల్లాలో 16.72 లక్షల విద్యుత్తు కనెక్షన్లున్నాయి. యాసంగి సాగు పనులు ముమ్మరం కావడంతో నంబర్లు వేసే ప్రక్రియకు విఘాతం కలుగుతోంది. ప్రస్తుతం పనులు లేని చోట్ల వేస్తున్నారు.

**వినియోగదారులకు మెరుగైన సేవలు**

స్తంభాలకు నంబర్లు వేయడం వల్ల సమస్య తలెత్తిన ప్రాంతాన్ని సులువుగా గుర్తించవచ్చు. జియోట్యాగింగ్‌తో సేవలు మెరుగవుతాయి. అనధికారిక స్తంభాలు వేసే అవకాశం ఉండదు. జిల్లాలో నంబర్లు వేసే ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. మాధవరావు, పెద్దపల్లి ఎస్‌ఈ

# రూపు మార్చి.. బురిడీ కొట్టిస్తూ!



జగిత్యాల : ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తికి వీడియోకాల్ వచ్చింది. ఫోన్ రిసీవ్ చేసుకున్న వ్యక్తికి అవతల పోలీసు కనిపించాడు. తాను హైదరాబాద్ నుంచి ఫోన్ చేస్తున్నాననీ, మీ కుమారుడు డిజిటల్ మోసాలకు పాల్పడ్డాడనీ సదరు పోలీసు చెప్పాడు. ఖంగుతిన్న తండ్రిని తనకు ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపిస్తే కేసు నమోదు కాకుండా చూస్తానని చెప్పాడు. దీన్ని నమ్మిన తండ్రి నగదు బదిలీ చేసి అనంతరం కుమారుడికి ఫోన్ చేయగా తాను క్షేమంగా ఉన్నాననీ, పోలీసులెవరూ తనను అరెస్టు చేయలేదనీ చెప్పడంతో మోసపోయానని గుర్తించాడు. సైబర్ మోసాలు రూపు మార్చుకున్నాయనడానికి ఇది ఓ ఉదాహరణగా నిలుస్తోంది. సైబర్ నేరాలపై పోలీసులు అప్రమత్తం చేస్తున్నా.. నేరగాళ్లు తమ మోసాల రూపు మార్చి మరీ బురిడీ కొట్టిస్తున్నారు. ఆన్‌లైన్ ట్రేడింగ్, క్రిప్టో పెట్టుబడులు, ఉద్యోగాలు, ఓటీపీ పేరిట మోసాలు.. ఇలా పలు విధాలుగా మోసాలకు పాల్పడుతూనే ఉన్నారు. ఆన్‌లైన్ మోసాల బారిన పడుతున్న వారిలో అత్యధికులు విద్యావంతులే ఉండటం నేరగాళ్ల తీవ్రతకు అద్దం పడుతోంది. పోలీసులు పలు విధాలుగా అవగాహన కల్పిస్తున్నా ఏటా బాధితులు పెరుగుతూనే ఉన్నారు..

**మచ్చుకు కొన్ని ఘటనలు**

జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం మద్దునూరుకు చెందిన ముంజల నారాయణకు చెందిన ఆధార్, పాన్‌కార్డులను మార్ఫింగ్ చేసిన సైబర్ నేరగాళ్లు ఏకంగా 7 బ్యాంకుల్లో రూ.20 లక్షల రుణాలు తీసుకున్నారని తెలిసి బాధితుడు లబోదిబోమన్నాడు. 2018 నుంచే జరుగుతున్న ఈ మోసం బ్యాంకర్లు 2024లో రుణం చెల్లించాలంటూ బాధితుడికి ఫోన్ చేయడంతో తెలిసింది.

కరీంనగర్ జిల్లా వీణవంక మండలం బేతిగల్‌కు చెందిన రిషివర్ధన్‌కు సైబర్ నేరగాళ్లు కొంత పెట్టుబడిపై లాభాలు చూపారు. రూ.2.50 లక్షలు కడితే మరిన్ని లాభాలు ఆర్జించవచ్చని ఆశ చూపారు. ఇంతలోనే ఆయన ఖాతా ఖాళీ కావడంతో తాను మోసపోయానని మథనపడిన రిషివర్ధన్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మూడు వారాల కిందట జరిగింది. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఓ విద్యావంతుడు షేర్ మార్కెట్ మోసాల బారిన పడి ఏకంగా రూ.90 లక్షల మేర నష్టపోయాడు. విద్యావంతులు కూడా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడుతున్నారని ఈ ఘటన తెలియజేస్తోంది.

**కేసుల వివరాలు ఇలా..**

కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో 2024లో ఆర్థిక నేరాలకు సంబంధించి 726 కేసులు నమోదు కాగా అందులో 46 శాతం సైబర్ నేరాలు ఉన్నాయి. సైబర్ నేరాలకు సంబంధించి 2,282 ఫిర్యాదులు రాగా 270 కేసులు నమోదు చేశారు. 233 కేసుల్లో బాధితులకు సంబంధించిన రూ.9.87 కోట్లు హోల్డ్‌లో ఉంచారు.

జగిత్యాల జిల్లాలో 2024లో 1,289 కేసులు నమోదు కాగా రూ.8 కోట్ల మేర బాధితులు నష్టపోయారు. జగిత్యాల పట్టణంలో 781 కేసులు నమోదయ్యాయి. సైబర్ నేరాలకు పాల్పడిన 702 మందిపై 438 కేసులు నమోదయ్యాయి. సైబర్ మోసాల్లో నష్టపోయిన రూ.8 కోట్లలో రూ.1.12 కోట్లు రికవరీ చేశారు.

పెద్దపల్లి జిల్లాలో 2024లో 148 సైబర్ కేసులు నమోదు కాగా బాధితులు రూ.3.67 కోట్లు మోసపోయారు.

ఇవి పాటించాలి..

చరవాణులకు వచ్చే సంక్షిప్త సందేశాలకు, కాల్ సెంటర్ల నుంచి వచ్చే ఫోన్లకు స్పందించవద్దు.

క్రిప్టో కరెన్సీలు, మల్టీ లెవల్ మార్కెటింగ్‌లను నమ్మొద్దు.

వ్యక్తిగత బ్యాంకు ఖాతా వివరాలు చెప్పవద్దు.

వాట్సప్‌లు, ఇతర సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఆన్‌లైన్ లింకులను తెరిస్తే ప్రమాదమే అని నిపుణులు చెబుతున్నారు.

రివ్యూ రేటింగ్, పెట్టుబడుల వల, బెట్టింగుల పేరిట మోసాలు పెరుగుతున్నాయి.

యువకులు, చిన్నారులు సామాజిక మాధ్యమాల వాడకాన్ని విరివిగా వాడటం మానేయడంతో పాటు తల్లిదండ్రులకు ఆన్‌లైన్ మోసాల గురించి తెలిపితే నష్టాలు తగ్గే అవకాశముంటుంది.

అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే వీడియోకాల్స్, ఓఎల్‌ఎక్స్ ప్రకటనలకు దూరంగా ఉండాలని పేర్కొంటున్నారు.

తాజాగా డిజిటల్ అరెస్ట్ పేరిట పోలీసులమంటూ ఫోన్‌కాల్స్ చేస్తూ వలలో వేస్తున్నారు. వీరి పట్ల అప్రమత్తంగా ఉండాలి.

**ఖాకీ కిడ్స్ వినూత్నం**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సైబర్ నేరాల నియంత్రణకు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఖాకీ కిడ్స్ పేరిట కార్యక్రమాన్ని రూపొందించి రోడ్డు ప్రమాదాలు నివారణ సహా సైబర్ నేరాల బారిన పడకుండా తల్లిదండ్రులు, ప్రజలను అప్రమత్తం చేసేందుకు యత్నిస్తున్నారు. సైబర్ నేరాలు జరిగే విధానం, ఓటీపీ మోసాలు, సామాజిక మాధ్యమాల్లో ఉద్యోగ ప్రకటనలపై అవగాహన కల్పిస్తున్నారు.

**తక్షణ ఫిర్యాదుతో న్యాయం**

ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తం చేస్తున్నా బాధితులు పెరుగుతున్నారు. సైబర్ నేరాలపై వస్తున్న ఫిర్యాదులపై కేసులు నమోదు చేస్తున్నాం. ఆన్‌లైన్ మోసాలు జరిగినప్పుడు 1930 నంబరుకు, సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే సత్వర న్యాయం జరిగే అవకాశం ఉంటుంది. నేరగాళ్లు నగదు ఖాళీ చేయకుండా ఖాతాను నిలిపివేసే వీలుంటుంది. పలువురు బాధితులు పోలీసులను ఆశ్రయించిన సందర్భాల్లో న్యాయం జరిగింది. ఫిర్యాదులను అనుసరించి కేసులు నమోదు చేసి నిందితులకు శిక్షలు పడేలా చేస్తాం. రఘుచందర్, జగిత్యాల డీఎస్పీ

# భూపరిహారానికి ఎదురుచూపులు

రామడుగు : రామడుగు శివారులోని మోతెవాగు కొత్త వంతెన నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందక, నిరీక్షణ తప్పడం లేదు. 2019లో రూ.7.9 కోట్లతో మంజూరు చేసిన కొత్త వంతెన నిర్మాణ సమయంలో భూసేకరణ ప్రక్రియ చేర్చలేదు. ఈ కారణంతో అయిదేళ్లు గడిచినా కొత్త వంతెన ప్రారంభం కాలేదు. గతేడాది సెప్టెంబరులో రూ.11.20 కోట్లతో సవరణ ప్రతిపాదన చేసి భూనిర్వాసిత రైతులకు పరిహారం ప్రకటించారు. నవంబరులో రూ.1.54 కోట్ల పరిహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. కానీ రెండు నెలలైనా పరిహారం రైతులకు అందలేదు.

**ఎమ్మెల్యే చొరవతో రాకపోకలు..**

గత వానాకాలంలో పాత వంతెనపై నుంచి వరద ప్రవహించడంతో రైతులను ఒప్పించి తాత్కాలికంగా రోడ్డు నిర్మించడంలో స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సఫలీకృతులయ్యారు. రామడుగు, పెగడపల్లి, గంగాధర, చొప్పదండి మండలాలకు చెందిన సుమారు 60 గ్రామాల ప్రజలు, వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థుల ఇబ్బందులు తప్పాయి. కానీ వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డుకు తారు లేకపోవడంతో వాహనదారులు దుమ్ముతో ఇబ్బంది పడుతున్నారు. పరిహారం చెల్లించి,



తారు రోడ్డు పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.

**మా ఖాతాలో పడలేదు..** కొత్త వంతెన పనులు మొదలుపెట్టిన నాటి నుంచి మా భూముల్లో వాహనాలు, సామగ్రి నిల్వ చేయడంతో పంటలు సాగు చేయలేకపోయాం. గత ప్రభుత్వం భూపరిహారం ప్రకటించకుండానే రహదారి ఏర్పాటుకు ప్రయత్నం చేస్తే అడ్డుకున్నాం. ఇప్పటి ప్రభుత్వం పరిహారం మంజూరు చేసింది. కానీ ఇంతవరకు మా ఖాతాలో పడలేదు. ప్రభుత్వం సత్వరం పరిహారం చెల్లించాలి. కడారి బీరయ్య, రామడుగు రైతు

# లెక్కల్లో పారదర్శకత..

సంగారెడ్డి : పొదుపు సంఘాల లెక్కలు పారదర్శకంగా ఉండాలి. ఇవి సక్రమంగా లేకపోతే గొడవలు జరిగే అవకాశం లేకపోలేదు. దస్త్రాలకు, అంతర్జాలంలో వివరాలకు పొంతన ఉండటం లేదు. ఇది సైతం ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు కట్ అప్ షీట్ల తయారీ విధానాన్ని తెరపైకి తీసుకొచ్చారు. పొదుపు సంఘాల లెక్కల్లో పారదర్శకత పెంపే లక్ష్యంగా దీన్ని ప్రవేశపెట్టడం విశేషం.

**ఏం చేస్తున్నారంటే..**

గ్రామైక్య సంఘం పరిధిలోని మహిళా సంఘాల లెక్కలన్నీ ప్రస్తుతం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న సంగతి తెలిసిందే. మరోవైపు పుస్తకాల్లోనూ నమోదు చేస్తున్నారు. ఇక్కడే తేడా వస్తోంది. బ్యాంకులో జమ చేసిన నగదు, రుణవాయిదాల చెల్లింపుల వివరాల నమోదులో వీవోఏలు చాలా చోట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో పుస్తకాలు, అంతర్జా



లం లెక్కలు సమానంగా ఉండని పరిస్థితి. ప్రస్తుతం ఈ లెక్కలను సరిచేసే పనిలో ఐకేపీ సిబ్బంది నిమగ్నమయ్యారు. గతేడాది డిసెంబరు వరకు పొదుపు సంఘాల్లో జరిగిన లావాదేవీలను పరిశీలిస్తూ.. అంతర్జాలం, పుస్తకాల్లో తేడాలు లేకుండా చూస్తున్నారు. దీనివల్ల ఎక్కడైనా వీవోఏలు లేదా గ్రూపు లీడర్లు అక్రమాలకు పాల్పడినా ఇట్టే తెలిసిపోతుంది.

**65 వేలకు పైగా సంఘాలు**

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో కలిపి 65,173 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. అన్నింటిలో కలిపి 6.87 లక్షల మంది సభ్యులుగా కొనసాగుతున్నారు. సంఘాల సభ్యులకు తమ సంఘం ఆర్థిక పరిస్థితులు తెలిసేలా ప్రతి ఏటా సంఘాల వారీగా ఆడిట్ నిర్వహిస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఉన్న వివరాలు, దస్త్రాల్లో ఉన్న వాటికి సరిపోక సరైన లెక్కలు తేలని పరిస్థితి నెలకొంటోంది.

**ఉన్నతాధికారుల ఆదేశాలతో..: జంగారెడ్డి, అదనపు డీఆర్డీవో, సంగారెడ్డి**

పొదుపు సంఘాలకు సంబంధించిన లెక్కల్లో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా సంఘాల వారీగా కట్ అప్ షీట్లు తయారుచేయిస్తున్నాం. లెక్కలు సక్రమంగా ఉంటేనే సభ్యుల మధ్య సత్సంబంధాలు ఉంటాయి.

# ఇక.. పురాల్లో ప్రత్యేక పాలన

సంగారెడ్డి : పురపాలక సంఘాల పాలకవర్గాల గడువు ఆదివారంతో ముగిసింది. దీంతో జహీరాబాద్ మినహా 7 జిల్లాలోని పురపాలికలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు అమల్లోకి రానున్నాయి. మున్సిపాలిటీలకు సంబంధించిన అన్ని అధికారాలు ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లాయి.

**అధికారులకు బాధ్యతలు**

జిల్లాలో జహీరాబాద్ మినహా మిగతా ఏడు పురపాలక సంఘాలకు ప్రత్యేకాధికారులను నియమించారు. సంగారెడ్డి, సదాశివపేట, అందోలు–జోగిపేట, నారాయణఖేడ్‌లకు అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) చంద్రశేఖర్, అమీన్‌పూర్, బొల్లారం, తెల్లాపూర్‌లకు పురపాలక శాఖ జాయింట్ డైరెక్టర్ ఫల్గుణ కుమార్‌లను ప్రత్యేకాధికారులుగా నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీరు సోమవారం విధుల్లో చేరనున్నారు. జహీరాబాద్ పురపాలికకు ఎన్నికలు నిర్వహించక పోవడంతో ఐదేళ్లుగా ఆర్డీవో ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తున్నారు. పట్టణాల్లో ఏ అభివృద్ధి కార్యక్రమం, పనులు జరగాలన్నా.. ఇక నుంచి ప్రత్యేకాధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. రాబోయే వేసవిలో నీటి సమస్య రాకుండా ఇప్పటి నుంచే ప్రత్యేక చర్యలు చేపట్టాలి. పాలకవర్గం గడువు ముగింపులో అన్ని పురపాలికల్లో భారీగా అభివృద్ధి పనుల కోసం ప్రతిపాదనలు రూపొందించి ఆమోదించుకున్నారు. వీటికి సంబంధించిన పనులు ప్రత్యేకాధికారుల అనుమతితోనే చేపట్టాలి. వీరు అందుబాటులో ఉంటేనే స్థానిక సమస్యలు పరిష్కారమవుతాయి.

**కొత్తవాటికి నియామకాలేవి?**

జిల్లాలో ఇటీవలే కొత్తగా ఇస్నాపూర్, గడ్డపోతారం, గుమ్మడిదల, కోహీర్ పురపాలక సంఘాలుగా ఏర్పాటయ్యాయి. వీటికి సిబ్బందిని నియమించకపోగా.. ప్రత్యేకాధికారులనూ ప్రకటించలేదు. కొత్త వాటిలో కమిషనర్‌తో పాటు ఇతర సిబ్బంది నియామకమైన తర్వాతే ప్రత్యేకాధికారులను నియమించే అవకాశం ఉందని పురపాలక శాఖ అధికారులు తెలిపారు.

# పంటల బీమా.. రైతన్నకు ధీమా

గజ్వేల్: ప్రకృతి వైపరీత్యాలు, ఇతర కారణాలతో పంటలు నష్టపోయే రైతులను ఆదుకునేలా పంటల బీమా అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పథకం అమలుకు భారతీయ వ్యవసాయ బీమా సంస్థ(ఏఐసీ) ముందుకొచ్చింది. 2021 నుంచి పంటల బీమా అమలు కావడం లేదు. వచ్చే వానాకాలం నుంచి పూర్తిస్థాయిలో అమలు చేయాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో అధ్యయనం చేస్తున్నారు. రైతుల తరుఫున బీమా ప్రీమియం ఉచితంగా చెల్లించి కేంద్రం సహాయంతో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో జిల్లాలోని లక్షలాది మంది కర్షకులకు బీమా ధీమా కానుంది. బీమా అమలులో లేకపోవడంతో ఇప్పటిదాకా జిల్లాలో చాలా మంది అన్నదాతలు పంట నష్టాలు ఎదుర్కొన్నారు. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

**వడగళ్ల వానలకు..** ఖరీఫ్ చివర్లో వడగళ్ల వానలకు 2,800 ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. పంటలు ఎండిపోయినా సందర్భంలోనూ రైతులను ఆదుకునేలా పంటల ఫసల్‌బీమా ధీమా ఇవ్వనుంది. వచ్చే వానాకాలం సీజన్ నుంచి బీమా అమలు చేసే అవకాశం ఉందని, విధివిధానాలు రాగానే రైతులను సమాయత్తం చేస్తామని వ్యవసాయ అధికారులు తెలిపారు. **గతేడాది యాసంగి పంట నష్టం:** వరి 44,601, ఉద్యాన పంటలు 6158, మొక్కజొన్న 475, ఇతర పంటలు 1173 ఎకరాల్లో నష్టపోయాయి. **జిల్లా వ్యాప్తంగా రెండు సీజన్లలో..** జిల్లా వ్యాప్తంగా 3 లక్షల మంది రైతులు ఖరీఫ్, యాసంగి సీజన్లలో 7 లక్షల ఎకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్న, ఉద్యాన పంటలు వేస్తారు. ఎకరాకు సరాసరి రూ.15 వేల చొప్పున దాదాపు రూ.10 వేల కోట్లకు పైగా పెట్టుబడి పెడుతున్నారు. పంట చేతికొచ్చే సమయంలో వడగళ్లు, అకాల వర్షాలు రావడంతో పూర్తిగా నష్టపోతుంటారు. వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం బీమా పథకం అమలు చేస్తుంది.

# నగరం.. ఆకర్షణీయం

కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ పాలకవర్గ పదవీకాలం ఈనెల 28తో ముగియనుంది. బాధ్యతలు చేపట్టిన రెండు నెలలకే ప్రపంచాన్ని వణికించిన కరోనా కల్లోలం సృష్టించింది. ఆ సమయంలో పాలకవర్గ సభ్యులు, అధికారులు అందించిన సేవలు ఇప్పటికీ నగరవాసులు మర్చిపోలేరు. రెండేళ్లపాటు అభివృద్ధికి ఆటంకం ఏర్పడినా ఆ తర్వాత ఊపందుకుంది. ఈ అయిదేళ్లలో నగర రూపురేఖలు మారిపోయాయి. దేశంలోని వంద ప్రాంతాలను ఆకర్షణీయ నగరాలు(స్మార్ట్‌సిటీ)గా తీర్చిదిద్దేందుకు నిర్ణయించగా అందులో కరీంనగర్ ఒకటి. అభివృద్ధి పనులు పూర్తి చేయడంలో వరుసలో ఉంది.

**ప్రధాన ప్రాజెక్టులు..**

స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో రూ.936.80 కోట్లతో 48 ప్రాజెక్టులకు ప్రతిపాదనలు చేయగా 45 పూర్తి చేశారు. మిగతా మూడు టెండర్ దశలో ఉండగా వీటినీ పూర్తి చేసేందుకు నిర్ణయించారు.



రహదారులు, డ్రైనేజీలు, పార్కులు, జంక్షన్లు, వరద కాలువలు, కమాండ్ కంట్రోల్, సీసీ కెమెరాలు, ట్రాఫిక్ సిగ్నళ్ల వంటి పనులు ఉన్నాయి. 24 గంటల తాగునీటి సరఫరా, చెత్తను శుద్ధి చేసేందుకు బయోమైనింగ్ వంటి పెద్ద ప్రాజెక్టులు తీసుకొని ప్రారంభించారు.

రెండు చోట్ల సమీకృత మార్కెట్లు నిర్మించాల్సి ఉండగా ఒకటి అందుబాటులోకి వచ్చింది. పట్టణ ప్రగతి నిధులతో ఓపెన్‌జిమ్‌లు, హైమాస్ట్ వీధిదీపాలు, పారిశుద్ధ్య పనుల నిర్వహణకు కొత్తగా ట్రాక్టర్లు, ఆటోలు, ట్యాంకర్లు, పబ్లిక్ టాయిలెట్లు, క్రీడా ప్రాంగణాలు నిర్మించారు. అత్యధిక డివిజన్లలో సాధారణ నిధులతో రహదారులు, మురుగుకాలువలు నిర్మించారు. నగర మేయర్ వై.సునీల్‌రావు, కమిషనర్లతో ఎప్పటికప్పుడు అభివృద్ధి పనులపై సమీక్షించారు.

**అసంపూర్తి పనులు.. ఫిర్యాదులు**

గతేడాది నుంచి ముఖ్యమంత్రి హామీ, పట్టణ ప్రగతి నిధులు నిలిచిపోవడంతో డివిజన్లలో అసంపూర్తి పనులు ఉన్నాయి. బిల్లుల చెల్లింపు లేకపోవడంతో వీధిదీపాలు వంటి అత్యవసర వస్తువులు కూడా లేకుండాపోయాయి. బకాయిలు భారీగా ఉన్నాయి. మరోవైపు అధికార పక్షమే అక్రమాలు జరిగాయని విమర్శలు గుప్పి స్తూ.. ఫిర్యాదులు చేస్తోంది. ప్రధానంగా స్మార్ట్‌సిటీ పనులపైనే ఇప్పటికీ ఆరోపణలున్నాయి. కొన్ని డివిజన్లకు ప్రాధాన్యం ఇవ్వలేదని పలువురు కార్పొరేటర్లు అసంతృప్తిలో ఉన్నారు. ఏడాది నుంచే అభివృద్ధి పనులు పూర్తిగా ఆపేయడంతో స్థానికులతోపాటు కార్పొరేటర్లు ఆగ్రహిస్తున్నారు.

**సఫాయిమిత్ర పురస్కారం**

నగరపాలక సంస్థ సఫాయి మిత్ర సురక్ష ఛాలెంజ్‌లో పోటీపడి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది. మూడు లక్షల జనాభాలో జాతీయ స్థాయిలో రెండో స్థానం సాధించి రూ.4 కోట్ల నగదు పురస్కారాన్ని సాధించింది. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో, వాటర్ ప్లస్‌లో స్థానాన్ని పదిలపర్చుకుంది. అర్బన్ మిషన్ భగీరథ కింద కొత్తగా ఫిల్టర్‌బెడ్ నిర్మించి చేసి రోజూ నీటి సరఫరా చేస్తున్నారు. ఇటీవల హౌసింగ్‌బోర్డుకాలనీలో 24 గంటల తాగునీటి సరఫరాను ప్రారంభించారు.

నగరవ్యాప్తంగా మొక్కలు పెంచాలనే లక్ష్యంతో స్థలం దొరికితే చాలు మొక్కలు నాటించడంతో ప్రస్తుతం నగరం పచ్చదనంతో ఉట్టిపడుతోంది. 22 నర్సరీలు, పట్టణ ప్రగతి వనాలు, చిట్టడవులలో భారీగా మొక్కలు పెంచారు. ఆయా ప్రాంతాల్లో ప్రస్తుతం అటవీ ప్రాంతాన్ని తలపించేలా ఉంది.

# నగర శివారుల్లో సాగు జోరు

ఏదులాపురం : రైతులు ఒకప్పటిలా మూస ధోరణిలో వ్యవసాయం చేయకుండా కాలానుగుణంగా సాగు విధానాన్ని మార్చుకుంటున్నారు. విపణిలో డిమాండ్ ఉన్న పంటలే పండించేందుకు ఆసక్తి చూపుతున్నారు. నిత్యావసరాలైన కూరగాయలు, ఆకు కూరలు సాగు చేయడం ద్వారా రైతులు రోజూ ఆదాయం పొందుతున్నారు. నగర శివారులో వీరి వ్యవసాయ క్షేత్రాలు ఉండటం కలిసి వస్తోంది. పండించిన ఆకుకూరలు, కూరగాయలు నగరానికి తీసుకొచ్చి విక్రయించి ఆదాయం పొందుతున్నారు. కుటుంబం మొత్తం సమష్టిగా కష్టపడుతూ సంవత్సరం పొడువునా లాభాలు ఆర్జిస్తున్నారు. నగరవాసులకు తాజా ఆకుకూరలు అందుబాటులోకి వస్తున్నాయి. కొంతకాలంగా మండలంలో పలు గ్రామాల్లో ఆకుకూరలు, కూరగాయల సాగు పెరుగుతోంది. రోజువారీగా సంపాదన రావడంతో సమీప రైతులు ఆకు కూరలు, కూరగాయల సాగుపై మొగ్గు చూపుతున్నారు.

ఏదులాపురం, పల్లెగూడెం, ముత్తగూడెం, తెల్దారుపల్లి, సత్యనారాణపురం, ఆరెంపుల, చింతపల్లి వెంకటగిరి తదితర గ్రామాల్లో చిన్న రైతులు ఎకరం, అరెకరంలో పండిస్తున్నారు. ఏదులాపురంలో మహిళలు కొంత పొలాన్ని కౌలుకు తీసుకొని ఒకేచోట ఆకుకూరలు



పండిస్తూ ఉమ్మడి వ్యవసాయ పద్ధతులు పాటిస్తున్నారు. పాలకూర, తోటకూర, బచ్చలకూర, మెంతి, గోంగూర, ముల్లంగి వంటివి సాగుచేస్తున్నారు. రోజు కనీసం రూ.1000 నుంచి రూ.1300 వరకు ఆదాయం లభిస్తోంది. ఖర్చులు పోను ఏడాదికి సుమారు రూ.2 లక్షల వరకు ఆదాయం సంపాదిస్తున్నవారు ఉన్నారు. వీరిని చూసి యువ రైతులు సైతం వీరి బాటలో పయనిస్తున్నారు.

**రైతు బజారులో విక్రయిస్తే లాభం** గడ్డ లింగారాజు, ఏదులాపురం

గతంలో రైతు బజారులో అమ్ముకుంటే బాగా లాభాలు వచ్చేవి. ఇప్పుడు ఆ అవకాశం లేదు. దళారులే అక్కడ వ్యాపారం చేస్తున్నారు. మా వద్ద తక్కువకు కొని మార్కెట్‌లో ఎక్కువ ధరకు అమ్ముకొని మారు బేరగాళ్లు లాభం పొందుతున్నారు. గతంలో మాదిరిగా రైతు బజారుల్లో రైతులే నేరుగా విక్రయించుకునే అవకాశం కల్పిస్తే బాగుంటుంది. గతంలో పాత బస్టాండ్ వద్ద రైతు బజారు ఉన్నప్పుడు మా వ్యాపారం బాగుంది.

# ఆరా తీస్తాం.. లెక్క తేలుస్తాం



హైదరాబాద్: జీహెచ్‌ఎంసీలో పొరుగు సేవల సిబ్బంది రెచ్చిపోతున్నారు. అధికారుల లాగిన్ వివరాలను తమ వద్దే ఉంచుకుంటూ అవినీతికి ఆజ్యం పోస్తున్నారు. ఒకే స్థానంలో ఏళ్లుగా పనిచేస్తూ అవినీతికి పాల్పడుతున్న పలువురు సిబ్బందిపై ఇటీవల కమిషనర్ ఇలంబర్తికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ప్రజావాణి, సామాజిక మాధ్యమాల్లోనే కాకుండా గుత్తేదారులు ఫిర్యాదు చేయడంతో కేంద్ర కార్యాలయంతోపాటు సర్కిళ్లు, జోనల్ కార్యాలయాల్లో పని చేస్తున్న పొరుగు సేవల సిబ్బందిపై విచారణ చేపట్టాలని నిర్ణయించారు. అందులో భాగంగా బల్దియా పరిపాలన విభాగం దాదాపు వెయ్యి మందితో జాబితాను సిద్ధం చేసింది. వారందరి పూర్వాపరాలను తెలుసుకోవడమే లక్ష్యంగా.. నిఘా వర్గాలతో సంప్రదింపులు జరుపుతోంది. 15 రోజుల్లో విచారణ నివేదికలను తెప్పించి తగు చర్యలు తీసుకుంటామని కమిషనర్ కార్యాలయం స్పష్టం చేస్తోంది. జీహెచ్‌ఎంసీలో అంతర్గత విచారణలకు ఏర్పాటు చేసిన విజిలెన్స్ విభాగం, రాష్ట్ర విజిలెన్స్‌కు కాకుండా నిఘా విభాగాన్ని సంప్రదించాలనే నిర్ణయం ఇదే మొదటిసారి కావడం గమనార్హం.

**ఆరోపణల నేపథ్యంలో..**

నగరపాలక సంస్థలో శివారు మున్సిపాలిటీలు 2007లో విలీనమయ్యాయి. ఆ సమయంలో జీహెచ్‌ఎంసీలో పొరుగు సేవల కింద నియామకమైన కొందరు ఇప్పటికీ అవే స్థానాల్లో కొనసాగుతున్నారు. తర్వాతి కాలంలో ఉద్యోగాల్లో చేరి.. 10ఏళ్లుగా కుర్చీలకు అతుక్కుపోయిన వారూ ఉన్నారు. వీరిపై ఇటీవల కమిషనర్ ఇలంబర్తికి ఫిర్యాదులు వరుస కడుతున్నాయి. అక్రమ నిర్మాణాల గుర్తింపును నిర్లక్ష్యం చేస్తున్న న్యాక్ ఇంజినీర్లు, చైన్‌మెన్లు, ప్రైవేటు బిల్ కలెక్టర్లు, బినామీ సంస్థలతో ఇంజినీరింగ్ పనులను దక్కించుకోవడం, టెండరు ప్రక్రియను పక్కదారి పట్టించడం, బంగ్లాదేశ్, రోహింగ్యాలకు జనన ధ్రువీకరణపత్రాలు ఇచ్చే ఆపరేటర్లు, తదితర విభాగాల్లోని పలువురు సిబ్బందిపైనా ఆరోపణలున్నాయి.


**వివరాలతో చర్యలు..**

ప్రస్తుత స్థానంలో సిబ్బంది ఎన్నాళ్లుగా పని చేస్తున్నారు, పోలీసు కేసులు, ఫిర్యాదులు, రాజకీయ సంబంధాలు, అవినీతి, ఇతరత్రా వివరాలను ఉద్యోగుల వారీగా అందించాలని కమిషనర్ నిఘా విభాగాన్ని కోరారు. అందులో భాగంగా ఉద్యోగుల పేర్లు, పని చేస్తోన్న స్థానం వంటి వివరాలతో కూడిన జాబితాను సిద్ధం చేస్తున్నామని, త్వరలోనే పోలీసులకు వివరాలు ఇవ్వబోతున్నట్లు ఓ ఉన్నతాధికారితో తెలిపారు.

**విజిలెన్స్ అధికారులకూ..**

ఇటీవల ఖాళీ అయిన చీఫ్ ఎంటమాలజిస్టు పోస్టును తనకు ఇప్పించాలంటూ ఓ అధికారి ప్రజాప్రతినిధుల ద్వారా కమిషనర్‌కు అనేక సిఫార్సు లేఖలు పంపించారు. కుదరదని చెప్పినా వినకుండా మళ్లీమళ్లీ వారితో ఫోన్ చేయించడంతో కమిషనర్ ఇలంబర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫాగింగ్‌కు సంబంధించి డీజిల్‌ను కొందరు సీనియర్, సహాయ ఎంటమాలజిస్టులు నల్లబజారులో విక్రయిస్తున్నారనే ఫిర్యాదులపై అన్ని జోన్లలో విచారణ జరపాలని అంతర్గత విజిలెన్స్ విభాగాన్ని ఆదేశించారు.

# నగరాభివృద్ధికి.. అర్బన్ ట్రాన్స్‌పోర్టు నిధి!




హైదరాబాద్: అభివృద్ధి చెందిన దేశాల మాదిరిగా నగరాభివృద్ధి కోసం అర్బన్ ట్రాన్స్‌పోర్టు ఫండ్(యూటీఎఫ్)ను ఏర్పాటు చేయనున్నారు. నగరంలోని ప్రజా రవాణాకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి కేటాయించనున్నారు. దీని కోసం కొన్నిరకాల సెస్‌లను వసూలు చేస్తారు. హైదరాబాద్ మహానగరం కూడా రోజు రోజుకు విస్తరించడం.. ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్‌కు పెరగనుండటంతో భవిష్యత్తులో పెద్దఎత్తున మౌలిక వసతులు అవసరం కానున్నాయి. సింహ భాగం ఆదాయం నగరం నుంచే వస్తున్నప్పటికీ హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ నిధుల కొరత ఎదుర్కొంటున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని ఒక ప్రత్యేక నిధి ఉండటం వల్ల నగర ప్రజల అవసరాలకు అనుగుణంగా కావాల్సిన అభివృద్ధి పనులు చేపట్టే వీలు ఉంటుంది. విధివిధానాలను ఖరారు చేసేందుకు హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలోని యునిఫైడ్ మెట్రోపాలిట్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ(ఉమ్టా) అధ్యయనం చేయనుంది.

**నిధిని ఎలా ఏర్పాటు చేస్తారంటే...**

నగరంలో రోజు 3 వేల కొత్త వాహనాలు విక్రయిస్తున్నారు. వీటికి సంబంధించి ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ రుసుం వస్తుంది. ఈ ఛార్జీల్లో కొంత సెస్ కింద యూటీఎఫ్‌కు మళ్లించే అవకాశం ఉంది. పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై ప్రభుత్వం విధించే వివిధ రకరాల సెస్‌లలో కొంత మొత్తం వేరుచేసే యోచన ఉంది. హెచ్‌ఎండీఏ చట్టం ప్రకారం మహానగర పరిధిలో చేపట్టే ప్రతి ప్రాజెక్టులో 1.25 శాతం హెచ్‌ఎండీఏకు డెవలప్‌మెంట్ ఛార్జీలు చెల్లించాలనే నిబంధన ఉంది. ప్రస్తుతం ఇది అమలు కావడం లేదు.

కొన్ని నగరాల్లో సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్(సీబీడీ)లు ఉంటాయి. ఆయా నగరాలకు ఆదాయం తెచ్చే వ్యాపార, వాణిజ్య ప్రాంతాలు ఇవి. పీక్ అవర్‌లో సొంత వాహనాలతో వెళ్లాలంటే కొంత సెస్ చెల్లించాలి. ప్రస్తుతం అమీర్‌పేట్, సికింద్రాబాద్, అబిడ్స్, మాదాపూర్ లాంటి బీజీ సెంటర్లను సీబీడీలు మార్చి అక్కడ నుంచి ప్రైవేటు వెహికల్స్ నుంచి సెస్ రూపంలో కొంత వసూలు చేసే యోచన ఉంది.

ఈ మొత్తం ప్రక్రియపై సమగ్ర సర్వే నిర్వహించి, ప్రాథమిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక అవసరాలకు తగినట్లు నిధిని ఎలా ఏర్పాటు చేయాలనే విషయమై కసరత్తు చేయనున్నారు. ప్రస్తుతం హెచ్‌ఎండీఏ కాంప్రెన్సివ్ మొబిలిటీ ప్లాన్(సీఎంపీ) రూపకల్పన చేస్తోంది.

# మూడు మండలాలు.. 39 కిలోమీటర్లు



మంథని : పెద్దపల్లి జిల్లాలో నాలుగు వరుసల గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అడ్డంకులు, అవరోధాలు దాటుకొని మంథని డివిజన్‌లోని రామగిరి, మంథని, ముత్తారం మండలాల పరిధిలో పనులు మొదలయ్యాయి. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి ఏపీలోని విజయవాడ వరకు నిర్మించనున్న హరిత జాతీయ రహదారి మంచిర్యాల నుంచి మంథని మీదుగా హనుమకొండ వరకు వెళ్తుంది.

**90 శాతం ట్రెంచ్ కటింగ్ పూర్తి**

ప్రధానమంత్రి గతిశక్తి పథకంలో భాగంగా రాష్ట్రంలో మూడు ప్యాకేజీలుగా పనులు చేస్తున్నారు. మొదటి ప్యాకేజీలో మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం నర్వ నుంచి పెద్దపల్లి జిల్లా మంథని మండలం పుట్టపాక వరకు.. రెండో ప్యాకేజీలో మంథని మండలం పుట్టపాక నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లా పంగిడిపల్లి వరకు పనులు చేపట్టారు. జిల్లాలో మంథని డివిజన్‌లోని రామగిరి, ముత్తారం, మంథని మండలాల్లోని 16 గ్రామాల మీదుగా 39.96 కిలోమీటర్ల మేర పనులు జరగనున్నాయి. 90 శాతం ట్రెంచ్ కటింగ్ పనులు పూర్తయ్యాయి.

**రెండు చోట్ల ఫ్లై ఓవర్‌లు**

మంథని మండలం విలోచవరం, నాగారం, పందులపల్లి, కన్నాల, పుట్టపాక.. రామగిరిలోని ఆదివారంపేట, బేగంపేట.. ముత్తారం మండలంలో శుక్రవారంపేట, లక్కారం, సర్వారం, మైదంబండ, పోతారం, కేశన్‌పల్లి, ముత్తారం, అడవి శ్రీరాంపూర్, ఓడేడ్ గ్రామాల మీదుగా రహదారి నిర్మించనున్నారు. మంథనిలోని పుట్టపాక వద్ద రింగ్‌రోడ్డు, ఫ్లై ఓవర్.. రామగిరిలోని బేగంపేట వద్ద ఫ్లైఓవర్‌ను నిర్మించనున్నారు.

**రూ.94 కోట్ల పరిహారం**

రహదారి నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న మంథని, ముత్తారం, రామగిరి మండలాల్లోని 1,519 మంది రైతులకు రూ.94 కోట్ల పరిహారం చెల్లింపునకు నేషనల్ హైవే అథారిటీ నుంచి నిధులు విడుదలయ్యాయి. మొదట్లో ఎకరానికి రూ.2 లక్షలు చెల్లిస్తామని ప్రకటించారు. భూములు ఇచ్చేందుకు రైతులు నిరాకరించడంతో ఆ మొత్తాన్ని రూ.6 లక్షలకు పెంచారు. ఇప్పటివరకు రూ.71 కోట్ల పరిహారాన్ని అందజేసినట్లు అధికారులు తెలిపారు.

**రైతుల ఆందోళన**

భూములకు తక్కువ పరిహారం ఇస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువ ధర చెల్లించాలని కోరుతూ పలువురు పరిహారం తీసుకోలేదు. అలాగే పట్టాలో ఒకరు, సాగులో మరొకరు ఉండటం, స్థానికంగా కొందరు అందుబాటులో లేకపోవడం, బ్యాంకు వివరాలు తప్పుగా నమోదవడం కారణంగా పరిహారం చెల్లింపులో జాప్యం జరుగుతోంది.

**డబ్బులు తీసుకోకుంటే కోర్టులో జమ**

హరిత రహదారి నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులు వెంటనే పరిహారం తీసుకోవాలి. పట్టాలకు సంబంధించి గొడవలుంటే ఇరు వర్గాలు పరిష్కరించుకోవాలి. రైతులు తీసుకోకుంటే కోర్టులో జమ చేయాల్సి వస్తుంది. కోర్టుల నుంచి పరిహారం పొందాలంటే రోజుల తరబడి వేచి చూడాల్సి ఉంటుంది. నిర్మాణం పనులను రహదారుల సంస్థకు అప్పగించాం.సురేశ్, మంథని ఆర్డీవో

# అతిథి విహంగాల అలక

ఖమ్మం : ఖమ్మం జిల్లా గ్రామీణ మండలం చింతపల్లికి ఒక ప్రత్యేకత ఉంది. ఏటా సైబీరియా కొంగలు ఇక్కడికి వచ్చి కొంతకాలం ఉండి వెళ్తాయి. సంతానోత్పత్తి కోసం వేల కిలోమీటర్లు ప్రయాణించి ఇక్కడికి చేరుకుంటాయి. ఒకప్పుడు వందలాదిగా తరలివచ్చిన కొంగల రాక రానురాను తగ్గిపోతోంది. విదేశీ అతిథులు ముఖం చాటేస్తున్నాయి. సైబీరియా నుంచి కొంగలు ఏటా నదులు, సముద్రాలు దాటి చింతపల్లికి వస్తాయి. డిసెంబరు చివరి వారంలో పైలెట్ కొంగలు వచ్చి ఇక్కడ పరిస్థితులు, నివాస యోగ్యత, ఆహార లభ్యత వంటి పరిస్థితులను పరిశీలించి వెళ్తాయి. అనంతరం జనవరి రెండో వారంలో పక్షుల రాక ప్రారంభమవుతుంది. జనవరి చివరి నాటికి పూర్తిస్థాయిలో కొంగలు చింతపల్లికి చేరుకుంటాయి. ఇక్కడ చింతచెట్లపై గూళ్లు




ఏర్పాటు చేసుకొని గుడ్లు పెట్టి, పిల్లలు చేస్తాయి. పిల్లలు పెద్దయ్యాక జులైలో పిల్లలతో కలిసి తమ ప్రాంతానికి తిరిగి వెళ్తాయి.

**ఈ ఏడాది రావడం కష్టమే..**

ఏటా జనవరి రెండో వారంలో కొంగలు రావడం ప్రారంభమవుతుంది. ఇప్పటికే జనవరి మూడో వారం దాటిన నేపథ్యంలో ఈసారీ సైబీరియా పక్షులు తమ ప్రాంతానికి వచ్చే అవకాశం లేదని గ్రామస్థులు చెబుతున్నారు.

**వందేళ్ల అనుబంధం**

సైబీరియా కొంగలతో చింతపల్లికి వందేళ్లకుపైగా అనుబంధం ఉంది. ఇవి తమ ప్రాంతానికి వచ్చిన ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండుతాయని గ్రామస్థులు నమ్ముతారు. 2010, 2011 ఏడాదిలో రెండేళ్ల పాటు ఇవి గ్రామానికి రాలేదు. ఆ రెండేళ్ల పాటు కరవు ఛాయలు అలుముకున్నాయి. కరోనా సమయంలోనూ పక్షులు వచ్చి వెళ్లాయి. మళ్లీ ఇప్పుడు నాలుగేళ్లుగా కొంగలు చింతపల్లికి రావడం లేదు.

**కారణాలు ఇవేనా!**

గ్రామంలో కుటుంబాలు పెరిగాయి. ఖాళీ స్థలాల్లో ఇళ్ల నిర్మాణాల కోసం చింతచెట్లను తొలగిస్తూ వస్తున్నారు. దీంతో వీటి సంఖ్య రోజురోజుకూ తగ్గుతోంది. దీనికి తోడు కోతుల బెడద ఎక్కువైంది. చెట్లపై కొంగలు గూళ్లు పెడితే వాటిని కోతులు పాడు చేస్తున్నాయి. దీంతో విహంగాలు రావడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు. 2017 నుంచి చింతపల్లిని తమ అధీనంలోకి తీసుకొని సైబీరియా కొంగల రక్షణకు అటవీశాఖ చర్యలు చేపడుతోంది.

# అవసరం తీరాలి.. ఆదాయం పెరగాలి

ఆదిలాబాద్ : ప్రతి వ్యక్తికి రోజుకు 325 గ్రాముల చొప్పున ఏడాదికి 2.80 లక్షల టన్నుల కూరగాయలు అవసరం.. ఉమ్మడి జిల్లా సాగు విస్తీర్ణం మేరకు అన్ని కూరగాయలు కలిపి 1.04 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి ఉందని అధికారులు అంచనా వేశారు. పండించిన ఉత్పత్తిలో ఎగుమతులు పోనూ జిల్లా కేంద్రంలో విక్రయించేది తక్కువే.. ఇక్కడ పండించని కూరగాయలతో పాటు కొరత ఉండే ఇతర కూరగాయలను సైతం ఇతర

ప్రాంతాల నుంచి రోజు వందల టన్నుల్లో దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. జిల్లా ప్రజల అవసరాలకు పోను, రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ఏడాది పొడవునా.. కూరగాయల సాగును చేపట్టేలా ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాలో అనుకూలమైన వాతావరణం, భూములున్నా కొంత మంది, కొన్ని గ్రామాల్లో మాత్రమే రైతులు కూరగాయలు సాగు చేస్తున్నారు. పట్టణానికి దగ్గరలో ఉన్న గ్రామాల రైతులు కూరగాయల సాగు చేయడం వల్ల లబ్ధి పొందే అవకాశముండటంతో సీజన్ల వారీగా ఏడాదంతా చేయించేందుకు వీలుగా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రైతులకు ప్రోత్సాహకాలతో పాటు నిల్వ, మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని ప్రతిపాదించారు. జిల్లా ప్రజలు ఎక్కువగా వినియోగించే వాటితో పాటు దిగుమతి చేసుకునే ప్రధాన పంటలు సాగు చేయించేందుకు వీలుగా పంట కాలనీలు ఏర్పాటు చేయాలని ఉద్యానశాఖ భావిస్తోంది. జిల్లా రైతులు కూరగాయలు సాగు చేస్తే.. వినియోగదారులకు తక్కువ ధరతో కూరగాయలు లభించడంతో పాటు రైతులు లబ్ధి పొందానికి అవకాశం ఉంది.

**ప్రతిపాదనలు ఇలా..**

మండలాల వారీగా కూరగాయల సాగు చేసే గ్రామాలను గుర్తించి, వాటి సాగును మరింత ప్రోత్సహించడం

జిల్లాలో టమాటా సాగు అత్యధికంగా ఉంటుంది. జిల్లా నేలలు అనుకూలంగా ఉండటంతో పాటు రైతులు అధునాతన పద్ధతులతో సాగు చేయడం వల్ల సాధారణ దిగుబడి కంటే ఎక్కువ దిగుబడులు వచ్చాయి. ఇక్కడ సాగయ్యే టమాటాను పక్క రాష్ట్రంలోని చంద్రాపూర్, నాగాపూర్, తదితర మార్కెట్లతో పాటు హైదరాబాద్, కరీంనగర్ తదితర జిల్లాలకు ఎగుమతి చేస్తున్నారు. రాయితీపై విత్తనాలతో పాటు, ఆధునిక యంత్రాలను సరఫరా చేయాలి.

ఉల్లి, టమాటా తదితర వాటిని నిల్వ చేసుకునే సౌకర్యాలు ఏర్పాటు చేయాలి.

రైతుబజార్లు, పంట ఉత్పత్తుల విక్రయాలకు ప్రత్యేకంగా షెడ్ల నిర్మాణం, కూరగాయల రవాణాకు వాహనాల సౌకర్యం ఏర్పాటు చేయడం.

జిల్లాలో ఉద్యాన పంటల సాగు ఎకరాల్లో

ఉద్యాన పంటలు: 66,700

కూరగాయలు: 42,350

పండ్లతోటలు: 18,640

సుగంధ ద్రవ్యాలు: 3,600

పూలు: 2110

కూరగాయల ఉత్పత్తి: 1.04 లక్షల మెట్రిక్ టన్నులు

అవసరం: 2.80 లక్షల మెట్రిక్ టన్నులు

రైతులకు రాయితీలు: సుధాకర్, జిల్లా ఉద్యానశాఖ అధికారి, ఆదిలాబాద్

కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు బిందు, సేద్య పరికరాలను రాయితీ ఇవ్వడానికి ప్రాధాన్యం ఇచ్చాం. జిల్లాలో కూరగాయల సాగు చేపట్టేందుకు వీలుగా 25 ప్రైవేట్ నర్సరీలు ఉన్నాయి.. వీటి ద్వారా రైతులకు నాణ్యమైన మొక్కలు రైతులకు అందుతుండటంతో కొన్ని మండలాల్లో సాగు పెరిగింది. టమాటా వర్షాధారంగా సాగులో ఉంది. టమాటాతో పాటు ఏడాది పొడవునా సాగు చేసే పంటలను సాగు చేసేలా పంట కాలనీలు ఏర్పాటు చేసేలా కార్యాచరణ రూపొందించాం.

# 'ఆసరా' పెంచండి.. హామీ నెరవేర్చండి

కుభీరు : నాటి తెరాస ప్రభుత్వం రూ.2016 ఆసరా పింఛన్లను ఇస్తే తమ అవసరాలకు ఎంతగానో ఉపయోగపడ్డాయని కానీ, కొవిడ్ తర్వాత ప్రతీ వస్తువు, సేవల ధరలు భారీగా పెరగడంతో అవి ఏమూలకు సరిపోవడం లేదని పింఛన్‌దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల్లో భాగంగా ఆసరా పింఛన్లను రెట్టింపు చేస్తామంటే ఎంతో ఆశగా ఆ పార్టీకి మద్దతుగా నిలిచామని చెబుతున్నారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా పింఛన్ల పెంపును పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. పాలక ప్రభుత్వం లబ్ధిదారులకు ఇచ్చే పింఛన్ పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.

**మాట నిలబెట్టుకోవాలి**

కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం ఆసరా పింఛన్లను పెంచుతుందని పింఛన్‌దారులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వృద్ధులకు ఇచ్చే పింఛన్ రూ.2016 నుంచి 4016కు, దివ్యాంగుల పింఛన్ రూ.4016 నుంచి రూ.6016 పెంచి ఇస్తారని ఆశలు రేకెత్తించారు. ఇచ్చిన హామీ ప్రకారం ఆసరా పెంచి అన్నివర్గాల లబ్ధిదారులకు చేయూత ఇచ్చి ఆదుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



**పింఛన్ పెంచాలి: ఎస్‌కే ఇమ్రాన్, దివ్యాంగుడు, కుభీరు**

ఆసరా పింఛన్ పెంపుపై ప్రభుత్వం ఆర్థిక మార్గాలు అన్వేషించాలి. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి. లబ్ధిదారులకు పింఛన్ పెంచుతు న్నట్లు శాసనసభ సమావేశాల్లో ప్రకటన చేయాలి. దివ్యాంగులకు ప్రయోజనం కల్పించి ఆదుకోవాలి.

**ప్రభుత్వ పరిశీలనలో ఉంది: విజయలక్ష్మి, డీఆర్డీఓ నిర్మల్**

ఆసరా పింఛన్ల పెంపు, పంపిణీ ప్రభుత్వ పరిశీలనలో ఉంది. మాకు ఎలాంటి సమాచారం లేదు. పింఛన్లు పెంచి పంపిణీ చేసే అందుకవ సరమైన దస్త్రాలు సిద్ధంగా ఉన్నాయి. ప్రభుత్వం పింఛన్ పెంచి ఇస్తే పారదర్శకంగా పంపిణీ చేస్తాం.

**జిల్లాలో పింఛన్ల వివరాలిలా..**

బీడీ కార్మికులు: 62,389
వితంతువులు: 35,587
వృద్ధులు: 27,597
దివ్యాంగులు: 9,626
ఒంటరి మహిళలు: 2,107
గీతకార్మికులు: 267
నేత కార్మికులు: 43
ఫైలేరియా బాధితులు: 49

# గత వైభవం.. అభివృద్ధి చేస్తే సుందరం

బెల్లంపల్లి : సింగరేణి సంస్థ ఏళ్లపాటు నిర్వహించిన పవర్‌హౌస్‌కు నిరంతరం నీళ్లు అందించిన బెల్లంపల్లి పట్టణంలోని పోచమ్మ గొలుసుకట్టు చెరువును ప్రభుత్వానికి అప్పగించింది. గత ప్రభుత్వ హయాంలో ఈ చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చారు. మిషన్ కాకతీయ కింద చెరువును రూ.1.50 కోట్లతో అభివృద్ధి చేశారు. కట్ట బలోపేతం చేసి చేతులు దులుపుకొన్నారు. కట్టపైన ఏర్పాటు చేసిన నాలుగు సౌరశక్తితో నడిచే విద్యుత్తు స్తంభాలు కనిపించడం లేదు. పోచమ్మ చెరువు మూడు గొలుసు చెరువుల సముదాయంగా ఉంటుంది. బెల్లంపల్లి బూదగెస్ట్‌హౌజ్‌కు వెళ్లే దారిలో ఉన్న చెరువు వేసవిలోనూ నీటితో కళకళలాడుతుంది.

బెల్లంపల్లి బూదగెస్ట్‌హౌజ్‌కు వెళ్లే రోడ్డుకు ఇరుపక్కల పోచమ్మ చెరువు విస్తరించి ఉంది. పెద్ద చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చారు. గొలుసు చెరువులుగా వినియోగించిన ఈ పోచమ్మ చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి అన్ని అవకాశాలున్నాయి. గత ప్రభుత్వ హయాంలో తూతూమంత్రంగా కట్టను బలోపేతం చేసి నిర్లక్ష్యంగా మధ్యలోనే వదిలేశారు. చెరువు కట్టపై మొక్కలు నాటినా వాటిని రక్షించలేకపోయారు. మట్టి, ఇసుక అక్రమ రవాణాకు ఇది అడ్డదారిగా మారింది. సిమెంట్ రోడ్డు వీరి కోసమే అన్నట్లుగా ఉంది. పోచమ్మ చెరువు పక్కనే పిల్లల ఉద్యానవనం, ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేశారు. పిల్లల ఉద్యానవనానికి సాయంత్రం పిల్లలతో వచ్చిన తర్వాత మినీ ట్యాంక్‌బండ్ వైపు రావాలంటే భయపడాల్సిన పరిస్థితి ఉంది.



కట్టపై వీధిదీపాలు లేవు. మరోవైపు మందుబాబులు ఇక్కడే పగలూ రాత్రీ తేడా లేకుండా మద్యం తాగుతున్నారు.

**గొలుసు చెరువుల అభివృద్ధిపై ఎమ్మెల్యే దృష్టి**

పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల పక్క నుంచి చెరువు విస్తరించి ఉంది. పక్కపక్కనే రెండు చిన్న చెరువులు ఉన్నాయి. రోడ్డు పక్కన పెద్ద చెరువు ఉంది. ఈ మూడు చెరువులను కలిపి అభివృద్ధి చేస్తే బెల్లంపల్లి పట్టణ ప్రజలకు ఆహ్లాదం పంచే అవకాశం ఉంటుంది. పోచమ్మ చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రణాళిక రూపొందించినట్లు సమాచారం.

**ఇలా చేయొచ్చు**

పోచమ్మ పెద్ద చెరువు మధ్యలో ఐలాండ్‌తో పాటు అక్కడే రెస్టారెంట్లు, ఉద్యానవనం ఏర్పాటు చేయడానికి అవకాశాలున్నాయి.
మూడు గొలుసు చెరువులను కలుపుతూ బోటింగ్ ఏర్పాటు చేయొచ్చు.
పెద్ద చెరువుతో పాటు చిన్నచెరువుల చుట్టు రోడ్లు నిర్మించవచ్చు.
తీగల వంతెన ఏర్పాటుకు అవకాశాలుంటాయి.

# క్లస్టర్లు పెంచితే.. కష్టాలు తీరు



భువనగిరి : పంటల లెక్కల ఆధారంగా 2017లో ప్రభుత్వం అయిదు వేల ఎకరాలకు ఒకటి చొప్పున క్లస్టర్ ఏర్పాటు చేసి ఏఈవోలను నియమించింది. కొందరిని శాశ్వత, మరికొందరిని ఒప్పంద, ఇంకొందరిని పొరుగు సేవల కింద ఏఈవోలుగా ఖాళీలను భర్తీ చేసి సేవలు అందించిన విషయం తెలిసిందే. వీరికి రైతు వేదికల నిర్వహణ బాధ్యతలను సైతం అప్పగించింది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ప్రస్తుతం సుమారు 20,83,653 ఎకరాలు సాధారణ సాగు ఉండగా, 17,89,628 ఎకరాల్లో ఆయా పంటల సాగును చేపట్టారు. పంటల సాగు విస్తీర్ణానికి సరిపడా క్లస్టర్లు లేక పోవడంతో వ్యవసాయ విస్తరణాధికారుల ద్వారా పూర్తిస్థాయిలో సేవలు అందక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు.

**ఉమ్మడి జిల్లాలో ఇలా..**

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 314 క్లస్టర్లు ఉన్నాయి. ఒక్కో క్లస్టర్ పరిధిలో అయిదు వేల ఎకరాల చొప్పున లెక్కిస్తే 15 లక్షల ఎకరాలు మాత్రమే ఉండాలి. సుమారుగా 3 లక్షల ఎకరాలు అదనంగా ఉండటంతో ఏఈవోలపై పని భారం పెరిగి రైతులకు సరిగ్గా సేవలు అందించలేని పరిస్థితి నెలకొంది. పంటల విస్తీర్ణానికి అనుగుణంగా అదనంగా 60కి పైగా క్లస్టర్లను ఏర్పాటు చేస్తేనే కష్టాలు తొలగిపోయే అవకాశం ఉంది. ఇదే సమస్యతో పంటల డిజిటల్ సర్వే తమ వల్ల కాదంటూ ఏఈవోలు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే సమస్య నెలకొనడంతో కొన్ని రోజులు సర్వే నిలిచినా ఆ తర్వాత ప్రభుత్వ ఒత్తిడితో కొనసాగించిన విషయం తెలిసిందే. పంటల సాగు విస్తీర్ణానికి అనుగుణంగా ప్రభుత్వం క్లస్టర్లు ఏర్పాటు చేయాలని రైతులు, ఏఈవోలు కోరుతున్నారు.

**రాజపేట మండలంలో పరిశీలిస్తే..**

యాదాద్రి, జనగామ, సిద్దిపేట మూడు జిల్లాల సరిహద్దు మండలం రాజపేట. ఈ ప్రాంతంలో సుమారు 38 వేల ఎకరాల వరకు సాగుకు యోగ్యమైన భూమి ఉంది. ఇందుకుగానూ గతంలో ప్రభుత్వం నాలుగు క్లస్టర్లను ఏర్పాటు చేశారు. ఒక్క పాముకుంట క్లస్టర్‌లో తొమ్మిది పంచాయతీలకు గానూ సుమారు 10,400 ఎకరాలు సాగవుతుంది. బొందుగుల క్లస్టర్‌లో నాలుగు గ్రామ పంచాయతీలకు గానూ 9,600 ఎకరాలు, రఘునాథపురం క్లస్టర్ పరిధిలో అయిదు గ్రామాలకు సుమారు తొమ్మిది వేలకు పైగా ఎకరాలు, రాజపేట క్లస్టర్‌లో తొమ్మిది వేల ఎకరాల వరకు సాగు ఉంటుంది. ఇందుకుగానూ అదనంగా 3 లేదా 4 క్లస్టర్లుగా విభజించాల్సిన అవసరం ఉంది. విస్తీర్ణం పెద్దది కారణంగా ఉన్న ఏఈవోలపైనే అదనపు భారం పడుతుండటంతో పూర్తిస్థాయిలో రైతులకు న్యాయం జరగడం లేదని ఇక్కడివారంటున్నారు.

**49 రకాల విధులతో.. తప్పని తిప్పలు..**

ప్రభుత్వం రైతు వేదికల ద్వారా ఏఈవోలతో అన్నదాతల సేవలను విస్తృత పరిచింది.
వ్యవసాయ శాఖ పరిధిలోని 49 రకాల సేవలు అందేలా బాధ్యతలు అప్పగించారు.
పొలాల వద్దకు పంటల వివరాలు ట్యాబ్‌లో ఏఈవోలు నమోదు చేయాలి.
రైతుబంధు దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు.
రైతుబీమా లబ్ధిదారులు చనిపోతే నామినికి బీమా ఇప్పించాలి.
సీఎం కిసాన్ సమ్మాన్ పథకం కింద డబ్బులు జమకాకపోతే పరిశీలన చేయాలి. రైతుల ఖాతాలు ఈకేవైసీ జరిగేలా చూడాలి.
ధాన్యం కొనుగోలు సమయంలో రైతులు నమోదు, తేమ శాతం పరిశీలించి ధ్రువీకరించాలి.
ఏఎస్‌వోలతో కలిసి పంట కోత ప్రయోగం (దిగుబడి అంచనా) నిర్వహించాలి.
ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతింటే నివేదికలు అందజేయాలి.
పంటల క్షేత్ర పరిశీలనతోపాటు యాజమాన్య పద్ధతులపై సూచనలు ఇవ్వాలి. ప్రభుత్వ పరంగా వచ్చే పథకాలు, రాయితీలు అందేలా చూడాలి. ప్రభుత్వం నుంచి ఎప్పటికప్పుడు వచ్చే ఆదేశాలను అమలు చేయడంతో పాటు రైతు వేదికల నిర్వహణ బాధ్యతలు చేపట్టాలి.
అదనపు పంటల విస్తీర్ణంతో పనిభారం పెరిగి ఆశించిన స్థాయిలో రైతులకు సేవలు అందడం లేదు.

# యువతకు రానుంది.. నైపుణ్యం



నల్గొండ : ఆధునిక పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా సాంకేతిక పట్టభద్రులకు అపార అత్యాధునిక ఉద్యోగావకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం సంకల్పించింది. పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లను అడ్వాన్సు టెక్నాలజీ సెంటర్ల(ఏటీసీ)లుగా ఆధునికీకరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. ఈ కేంద్రాల్లో సిబ్బంది కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఐటీఐల సిలబస్ ఉండాలని స్పష్టం చేశారు. సీఎం ఆదేశాలకు అనుగుణంగా ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆరు ఐటీఐ కళాశాల్లోనూ సంస్కరణలు మొదలయ్యాయి. ఈ మేరకు పాలిటెక్నిక్ కళాశాలలో కొత్త ఏటీసీల ఏర్పాటును పరిశీలించేలా చర్యలు తీసుకోనున్నారు. స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి ఐటీఐ, పాలిటెక్నిక్, ఏటీసీ కళాశాలను తీసుకు వచ్చే విధంగా కార్యాచరణ సిద్ధమైంది. రూ.2,400 కోట్లతో టాటా సంస్థ, ప్రభుత్వం కలిసి రాష్ట్రంలోని 65 ఐటీఐ కళాశాలలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా (ఏటీసీ)లుగా మార్చనున్నారు. వీటి అభివృద్ధికి 86 శాతం టాటా సంస్థ, 14 శాతం మేర రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటు అందించి సంయుక్తంగా అభివృద్ధి చేస్తున్నారు. ఈ డిసెంబరు 7న సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా ఏటీసీ భవనం ప్రారంభమైన అందుబాటులోకి వస్తుందని అనుకున్నప్పటికీ అభివృద్ధి పనులు పూర్తి కాకపోవడంతో ప్రారంభోత్సవం నిర్వహించలేదు.

**ఆరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో ఆరు కోర్సుల్లో శిక్షణ**

నల్గొండలో ఒక బాలుర, ఒక బాలికల, అనుముల (హాలియా), డిండి కళాశాలలుండగా.. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో ఒక్కొక్కటి చొప్పున ఐటీఐలు ఉన్నాయి. ప్రతి సంవత్సరం 1,500 మంది విద్యార్థులు ఇందులో ప్రవేశాలు పొందుతున్నారు. వీటన్నింటిలో ప్రస్తుతం 6 కోర్సులైన కంప్యూటరైజ్డ్ న్యూమెరికల్ కంట్రోల్(సీఎన్‌సీ), అడ్వాన్స్ టూల్స్, బేసిక్ డిజైన్ ఇన్ మెకానికల్, ఇండస్ట్రియల్ రోబోటిక్ అండ్ డిజిటల్ మాన్యుఫాక్చర్ టెక్నీషియన్, ఎలక్ట్రానిక్ వాహనాల మెకానిక్, మాన్యుఫాక్చర్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ కోర్సులు ప్రవేశపెట్టనుండగా భవిష్యత్తులో 20 రకాలైన అత్యాధునిక కోర్సులకు డిమాండ్‌కు అనుగుణంగా ప్రవేశపెట్టనున్నారు. ప్రస్తుతం భవనాలన్నింటిలో పాఠ్యాంశాల బోధన జరుగుతుండగా ప్రారంభోత్సవాల అనంతరం ప్రాక్టికల్స్ నిర్వహణ, ఉద్యోగ మేళా కార్యక్రమాలు కూడా టాటా సంస్థ చేపట్టనుంది.

**80 శాతం పనులు పూర్తయ్యాయి** – నరసింహాచారి, ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్, నల్గొండ

డిండి ఐటీఐ, నల్గొండ బాలురు, బాలికల కళాశాలలు, అనుముల ప్రాంతంలో ఐటీఐ కళాశాలలుండగా వీటన్నింటిలో ఏటీసీ కేంద్రాల భవనాలు నిర్మితమవుతున్నాయి. టాటా సంస్థ వారు 86 శాతం మేర నిధుల్లో భవన నిర్మాణ డిజైన్లు, అత్యాధునిక పరికరాలు, శిక్షణ సిబ్బంది, జీత భత్యాలు అన్నింటిని సమకూరిస్తే ప్రభుత్వం స్థలం, మౌలిక వసతులు కల్పించింది. టీజీఐఐసీ ఆధ్వర్యంలో సివిల్ వర్క్స్ జరుగుతున్నాయి. అత్యాధునిక పరికరాల బిగింపు పనులు మిగిలి ఉన్నాయి. ఎలక్ట్రికల్ కారు ట్రేడ్, మెకానికల్ ట్రేడ్ శిక్షకులు మాత్రమే వారికి తరగతులు బోధిస్తున్నారు. భవనం అందుబాటులోకి వచ్చాక మిగిలిన కోర్సులకు సైతం అన్నీ తరగతులు నిర్వహిస్తాం.

# భూ ఆక్రమణపై నోటీసులు

మల్యాల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు అంజన్న ఆలయ పరిసరాల్లోని అటవీ భూములను ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టారని పేర్కొంటూ ఇటీవల ఆలయ అధికారులకు నోటీసు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. కొండగట్టు అంజన్న ఆలయం పేర దాదాపు 650 ఎకరాల భూములున్నాయి. దాదాపు 22 ఎకరాల విస్తీర్ణంలో ఆలయ పరిసరాలు విస్తరించి ఉన్నాయి. మిగిలిన భూములు మల్యాల, కొడిమ్యాల మండలాల పరిధిలో ఉన్నాయి. వాటిలో అత్యధికంగా మల్యాల మండలం ముత్యంపేట పరిధిలోనే ఉన్నాయి. కొండపైన 360 హెక్టార్లలో అటవీ ప్రాంతం ఉంది. ఏళ్ల కిందట కొండపైన అటవీ భూముల్లో పలు నిర్మాణాలు చేపడితే చూసీచూడనట్లు వ్యవహరించిన అటవీశాఖ అధికారులు తాజాగా నోటీసులు జారీ చేయడమేంటని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కొండపైన దాదాపు 15 ఏళ్ల కిందట నిర్మించిన సాగర్ అతిథి గృహం, పదేళ్ల కిందట నిర్మించిన ఈవో కార్యాలయ భవనం, ధర్మసత్రం, హరిత గెస్ట్ హౌజ్ ప్రాంతం, దాదాపు 30 ఏళ్ల కిందట నిర్మించిన బస్టాండుతోపాటు ఈవో కార్యాలయం ముందు ఖాళీ స్థలం అటవీశాఖకు చెందినదని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. దాదాపు 6 ఎకరాల అటవీ భూములను ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టారని అటవీ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తుండటంపై భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

కొండగట్టుపై 'వై' జంక్షన్ సమీపంలో అటవీ భూముల రక్షణకు గోడ, ఫెన్సింగ్ నిర్మాణ పనులకు టెండర్లు కూడా పూర్తయినట్లు తెలిసింది. ఇటీవల గుత్తేదారు కందకం తవ్వడంపై అధికార పార్టీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో తాత్కాలికంగా నిలిపివేసినా ఫెన్సింగ్ పనులు చేపట్టనున్నట్లు అటవీ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈవో కార్యాలయ భవనం వెనుకవైపు అటవీ ప్రాంతంలో రెండో వాచ్‌టవర్ నిర్మాణ పనులు కూడా చేపట్టారు. అంతేకాకుండా అటవీ ప్రాంతం నుంచి జేఎన్టీయూ కళాశాలకు వెళ్లే మార్గం వరకు భక్తుల కోసం నడక మార్గం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. 'వై' జంక్షన్ సమీపంలో అటవీ అధికారులు కాంక్రీటుతో నిర్మించిన కుటీరంలాంటి షెడ్డు ప్రాంతంలో పార్కు నిర్మాణం కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. భక్తుల కోసం చేపట్టినవే..కొండగట్టు ఆలయ పరిసరాల్లో ఏళ్ల కిందట నిర్మించిన పలు భవనాలు అటవీ ప్రాంతంలో నిర్మించినట్లు పేర్కొంటూ సంబంధిత అధికారులు అందజేసిన నోటీసుకు సమాధానం పంపిస్తున్నాం. ఒకవేళ అధికారులు పేర్కొన్నట్లు 6 ఎకరాల అటవీ భూముల్లో నిర్మాణాలు చేపట్టినట్లు తేలితే దేవాదాయశాఖ కమిషనరు దృష్టికి తీసుకెళ్లి అందుకు రెట్టింపు ఆలయ భూమిని అటవీశాఖకు అప్పగిస్తాం.

# నిర్లక్ష్యపు వ్యథ.. ఇది మానేరు కథ

కరీంనగర్: ఈ చెక్‌డ్యామ్‌ను ఆరు నెలల కిందటే పూర్తి చేయాలి. సకాలంలో పూర్తి చేయకపోవడంతో ఇలా నీటి ప్రవాహం మధ్యలో ఇనుపచువ్వలు ఉండిపోయాయి. ఫిల్లర్ల నిర్మాణాన్ని ఇంకా చేపట్టాల్సి ఉంది. మొత్తంగా 15 ఫిల్లర్లలో ఒకదాన్ని మాత్రం సిమెంట్‌తో నిర్మించి వదిలేశారు. దీన్ని పూర్తి చేస్తేనే పర్యాటకుల ఆహ్లాదానికి అవకాశముంటుంది. పైగా ఇరువైపులా నిర్మించిన మట్టి కట్టలో ఒకవైపు 32 బ్లాక్స్ పూర్తి కాగా, మరోవైపు ఇంకా సగం మట్టి, రాళ్లు నింపాల్సి ఉంది. ఇన్నాళ్లపాటు మానేరు నదిలో నుంచి తీసుకొచ్చిన మట్టిని పోయగా.. రివర్‌ఫ్రంట్ పనుల ప్రదేశంలో ఉన్న రాళ్లనే ఈ కట్ట నిర్మాణానికి వినియోగించారు.మానేరు నది ప్రధాన గేట్ల దిగువన దాదాపు 3 కి.మీ మేర నిర్మించే ఈ రివర్‌ఫ్రంట్ పనులు ఒకడుగు ముందుకు, నాలుగు అడుగులు వెనక్కి అనే విధంగానే సాగుతున్నాయి. పనుల ప్రగతిలో ఆరంభశూరత్వమనేది స్పష్టంగా కనిపిస్తోంది. దీని నిర్మాణానికి రూ.470 కోట్లను వెచ్చించాలనుకున్నారు. నీటిపారుదల, పర్యాటక శాఖలు నిర్మాణ బాధ్యతలు చేపట్టాయి. ఇరువైపులా మట్టి, రాళ్లను నింపే పని మాత్రమే పూర్తయింది. మొదటి దశ పనుల్లో భాగంగా దాదాపు 74 శాతం పని పూర్తయినట్లు అధికారులు



చెబుతున్నారు. ఇందుకోసం రూ.201 కోట్లు ఖర్చు చేశారు. ఈ ఏడాది మే నాటికి ఈ మొదటి దశ పనులు పూర్తికావాల్సి ఉండగా.. వచ్చే ఏడాది నాటికి కొలిక్కి వచ్చే వీలుంది.

**మళ్లీ.. రూ.234 కోట్లు విడుదల..**

ఇటీవల మళ్లీ మిగులు పనుల కోసం రూ.234 కోట్లు విడుదలయ్యాయి. వీటితో రెండో దశ పనులను చేపట్టబోతున్నారు. గతంలో నిర్మించకుండా వదిలేసిన మురుగు, వరదకాలువల కోసం రూ.60 కోట్లు వెచ్చించబోతున్నారు. మిగతా మొత్తాన్ని చెక్‌డ్యామ్ నిర్మాణంతో పాటు మిగతా నింపాల్సిన మట్టి, రాళ్ల కోసం వెచ్చిస్తారు. మొదట్లో ఈ రివర్ ఫ్రంట్ పనుల అంచనా రూ.410 కోట్లు అని ప్రారంభించగా.. తర్వాత ఈ వ్యయం విలువ రూ.470 కోట్లకు చేరింది. ఈ నిధులు పూర్తి స్థాయి పనులకు సరిపోవనేది స్పష్టమవుతోంది. ఫౌంటెయిన్ నిర్మాణంతోపాటు పర్యాటక శాఖ తరపున చేపట్టాల్సిన వాటికి కూడా నిధులు అవసరమవుతాయి.

ఇలా.. నగరంలో నుంచి వెలువడే మురుగంతా.. మానేరు రివర్‌ఫ్రంట్ లోకే వెళ్తుంది. రాంపూర్, అంబేద్కర్ మైదానం, శనివారం మార్కెట్ ప్రాంతాల నుంచి ఉన్న నాలాలన్నీ.. ఇందులో కలుస్తాయి. వాస్తవానికి ఇరువైపులా కట్టను నిర్మించడానికి ముందుగానే పాత వంతెన నుంచి తీగల వంతెన అవతలి వరకు మురుగు, వాన నీరు వెళ్లే కాలువ నిర్మించాలి. అలా చేయకుండానే మట్టి, రాతికట్టడాలను నిర్మించడంతో ఇబ్బంది నెలకొంది. మురుగును శుద్ధి చేయకుండానే మానేరులోకి వదిలితే పరివాహక ప్రాంత రైతులకు.. పర్యాటకులకు వాసన ముప్పు తప్పదు. కరీంనగర్, సదాశివపల్లి, అలుగునూర్‌ల నుంచి వెలువడే వ్యర్థాల విషయంలో అవసరమైన మార్పులు చేపట్టాలి.

**త్వరితగతిన పూర్తి చేస్తాం**

పనుల విషయంలో పర్యవేక్షణ పెంచుతున్నాం. మొదటి దశ పనులు వచ్చే ఏడాది మే నాటికి పూర్తవుతాయి. ప్రస్తుతం కట్టలకు ఇరువైపులా మురుగుకాలువ వ్యర్థాలు వెళ్లేందుకు వీలుగా కాలువల నిర్మాణాలు చేపడతాం. ఇటీవల రెండో విడుత నిధులు విడుదలయ్యాయి. అవసరమైన పనులన్నింటిని త్వరితగతిన పూర్తిచేస్తాం. – నాగభూషణం, ఈఈ, నీటి పారుదలశాఖ, కరీంనగర్

# అడవి తగ్గుతోంది..

ఆదిలాబాద్ : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అడవులకు ప్రసిద్ధి..అలాంటిది ప్రస్తుతం అరణ్యాల విస్తీర్ణం బాగా తగ్గిపోతోంది. మంచిర్యాల మినహా మిగిలిన మూడు జిల్లాల్లో అటవీ విస్తీర్ణం తగ్గినట్లు కేంద్ర పర్యావరణ, అటవీశాఖ ఇటీవల విడుదల చేసిన ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్ట్(ఐఎస్‌ఎఫ్) 2023 వెల్లడించింది. రాష్ట్రం మొత్తంలో అటవీ విస్తీర్ణంలో పూర్వ ఆదిలాబాద్ జిల్లా గతంలో మొదటి స్థానంలో ఉండేది. జిల్లాల విభజన తర్వాత కుమురంభీం జిల్లా మూడో స్థానానికి చేరుకుంది. అటవీ విస్తీర్ణం పెంపునకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోట్లు వెచ్చిస్తున్నా జిల్లాల్లో ఆశించిన స్థాయిలో అటవీ ప్రాంతం పెరగడం లేదని ఈ నివేదికలతో స్పష్టం అవుతోంది.దేశంలో అడవుల విస్తీర్ణం, పెరుగుదల తదితర వాటికి సంబంధించిన ఐఎస్‌ఎఫ్ నివేదికలను కేంద్ర పర్యావరణ, అటవీశాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ ఇటీవల విడుదల చేశారు. ఆ నివేదిక ప్రకారం అటవీ విస్తీర్ణం తగ్గుదలలో తెలంగాణ దేశంలో మూడో స్థానంలో నిలిచింది. పూర్వ జిల్లాలవారీగా ఉమ్మడి ఆదిలాబాద్ భౌగోళిక విస్తీర్ణం 16,105 చదరపు కి.మీలుకాగా 5,743.42 చదరపు కి.మీల్లో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది.

**మొక్కలు నాటినా..**

తాజా నివేదికలో జిల్లాలవారీగా అటవీ విస్తీర్ణాన్ని వెల్లడించారు. హరితహారం పేరిట జిల్లాల్లో ఇప్పటి వరకు 20 కోట్ల మొక్కలు నాటినట్లు అటవీశాఖ చెబుతోంది. ఈ లెక్కన జిల్లాలవారీగా అటవీ విస్తీర్ణం పెరగాలి. కానీ నివేదికలో మంచిర్యాల జిల్లాలో మినహా మిగిలిన మూడు జిల్లాల్లో తగ్గినట్లు ఉంది. రాష్ట్రంలో అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లాలో 115.50 చ.కి.మీలు, నిర్మల్ జిల్లాలో 45.37 చ.కి.మీలు, కుమురంభీం జిల్లాలో 44.61 చ.కి.మీలు తగ్గింది. మంచిర్యాల జిల్లాలో మాత్రం 34.96 చ.కి.మీల విస్తీర్ణం పెరిగినట్లు నివేదిక వెల్లడించింది.

**పోడుతోపాటు స్మగ్లింగ్**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అనేక గ్రామాలు అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉండటంతో ఆయా గ్రామాల ప్రజలు జీవనోపాధి కోసం సమీప అటవీ భూములను వ్యవసాయానికి అనుకూలంగా మలుచుకోవడంతో అటవీ విస్తీర్ణం తగ్గుతూ వస్తుంది. ఇక్కడ ఉన్న నాణ్యమైన టేకుకు విలువ ఎక్కువగా ఉండటంతో కొన్ని ప్రాంతాల్లో ఈ వృక్షాలను నరికి స్మగ్లింగ్ చేస్తున్నారు. అధికారులు ఎంత నిఘా పెట్టినా గుట్టుచప్పుడు కాకుండా కలప తరలిపోతుంది. దీంతోపాటు ఒకటిగా ఉన్న గ్రామాల్లోని జనం మధ్య భేదాభిప్రాయాలు వస్తుండటంతో విడిపోయి సమీప అటవీ ప్రాంతాన్ని చదును చేసుకొని మరో గ్రామాన్ని ఏర్పాటు చేసుకుంటున్నారు.

**సింగరేణి సంస్థతో..**మంచిర్యాల జిల్లాలో బొగ్గు గనులు ఉండటంతో పర్యావరణ పరిరక్షణలో భాగంగా అక్కడి సింగరేణి సంస్థ కోట్లల్లో మొక్కలు నాటి అటవీ సంపదను సృష్టించడంతో కొంత అటవీ ప్రాంతం పెరిగినట్లు భావిస్తున్నారు.తగ్గిన అగ్ని ప్రమాదాలు

అటవీ ప్రాంతాల్లో జరిగే అగ్ని ప్రమాదాలు గతంతో పోలిస్తే తగ్గాయి. 2023 నవంబరు నుంచి 2024 జూన్ మధ్యలో జరిగిన ప్రమాదాలను నివేదికలో వెల్లడించారు. అటవీ అగ్ని ప్రమాదాలు అత్యధికంగా నిర్మల్ జిల్లాలో చోటుచేసుకున్నాయి. అయితే గతంతో పోలిస్తే నాలుగు జిల్లాలో అగ్ని ప్రమాదాల్లో తగ్గుదల ఉంది.




అమరావతి: చిత్తూరు జిల్లాలో వైకాపా నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అటవీ భూముల కబ్జాపై ఏపీ ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. ఆక్రమణల వ్యవహారంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పులిచర్ల మండలం మంగళంపేట రెవెన్యూ గ్రామ పరిధిలో జరిగిన ఈ భూ అక్రమాలపై అధికారులు నివేదికలు సిద్ధం చేశారు. 75 ఎకరాల అటవీ భూములు అక్రమంగా పెద్దిరెడ్డి కుటుంబం పరిధిలో చేర్చడంపై ఇప్పటికే సీఎం వద్దకు ప్రాథమిక నివేదిక చేరింది.

మరోవైపు పుంగనూరు, తంబళ్లపల్లి, రేణిగుంట మండలాల్లో రికార్డుల తారుమారు, బినామీ పేర్లతో వందల ఎకరాలను ఆక్రమించినట్లు ఆరోపణలు ఉన్నాయి. వీటిపై పక్కా ఆధారాల సేకరణతో కఠిన చర్యలకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

# తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల




దిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. ఏపీ, తెలంగాణలో మూడు చొప్పున స్థానాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ విడుదల కానుంది. అదే నెల 27న పోలింగ్ నిర్వహించి.. మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఏపీలో ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉపాధ్యాయ స్థానానికి పోలింగ్ జరగనుంది. తెలంగాణలో మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గానికి ఎన్నికలు నిర్వహించనున్నారు. అదే స్థానంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు కూడా జరగనున్నాయి. వీటితో పాటు వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గానికి ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది.




శ్రీహరికోట: ఇస్రో చరిత్రాత్మక వందో ప్రయోగం విజయవంతమైంది. శ్రీహరికోటలోని షార్ నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్‌ను ప్రయోగించారు. ఈ రాకెట్.. ఎన్‌వీఎస్-02 ఉపగ్రహాన్ని తీసుకొని నింగిలోకి దూసుకెళ్లింది. ఉపగ్రహం విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశించింది. ఎన్‌వీఎస్-02 ఉపగ్రహం.. ఇస్రో శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన స్వదేశీ నావిగేషన్ ఉపగ్రహ వ్యవస్థ.

దీని బరువు 2,250కిలోలు. ఇది కొత్తతరం నావిగేషన్ ఉపగ్రహాల్లో రెండోది. ఇస్రో అధిపతిగా బాధ్యతలు చేపట్టిన వి.నారాయణన్‌కు ఇది మొదటి ప్రయోగం కావడంతో ఆయనే స్వయంగా అన్ని ప్రక్రియలనూ పర్యవేక్షించారు. భౌగోళిక, వైమానిక, సముద్ర నేవిగేషన్ సేవల కోసం ఈ ఉపగ్రహ ప్రయోగం ఉపయోగపడనుంది. వ్యవసాయంలో సాంకేతికత, విమానాల నిర్వహణ, మొబైల్ పరికరాల్లో లోకేషన్ ఆధారిత సేవలందించనుంది.

**ఈ వందో ప్రయోగం మైలురాయిగా నిలుస్తుంది: ఇస్రో ఛైర్మన్ నారాయణన్...** ఇస్రో శాస్త్రవేత్తలకు ఛైర్మన్ నారాయణన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది చేపట్టిన తొలి ప్రయోగం విజయవంతమైందని చెప్పారు. నావిగేషన్ శాటిలైట్‌ను నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టినట్లు వివరించారు. ఈ వందో ప్రయోగం మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. "ఎన్‌వీఎస్-02 ఉపగ్రహం పదేళ్ల పాటు సేవలందిస్తుంది. విక్రమ్ సారాబాయ్ హయాం నుంచి ఇస్రో విజయ పరంపర కొనసాగింది. ఇప్పటి వరకు 6 జనరేషన్ల లాంచ్ వెహికిల్స్ అభివృద్ధి చేశాం. 1979లో అబ్దుల్ కలాం నేతృత్వంలో తొలి లాంచ్ వెహికిల్ ప్రయోగం జరిగింది. ఇప్పటివరకు శ్రీహరికోట వేదికగా 100 ప్రయోగాలు జరిగాయి. 100 ప్రయోగాల్లో 548 శాటిలైట్లను కక్ష్యలోకి పంపాం. 3 చంద్రయాన్, మాస్ ఆర్బిటర్, ఆదిత్య, ఎస్ఆర్ఈ మిషన్లు చేపట్టాం." అని నారాయణన్ తెలిపారు.

# రాంగోపాల్ వర్మకు మరోసారి ఏపీ పోలీసుల నోటీసులు



ఒంగోలు: దర్శకుడు రాంగోపాల్ వర్మ(ఆర్జీవీ)ను అసభ్యకర పోస్టుల కేసు వెంటాడుతోంది. ఈ వ్యవహారంలో ప్రకాశం జిల్లా ఒంగోలు రూరల్ పోలీసులు మరోసారి నోటీసులు జారీ చేశారు. ఫిబ్రవరి 4న విచారణకు రావాలని ఆర్జీవీకి వాట్సప్ ద్వారా ఇచ్చిన నోటీసుల్లో పోలీసులు పేర్కొన్నారు. 4న సినిమా షూటింగ్‌ల నిమిత్తం బిజీగా ఉంటానని.. విచారణకు రాలేనని ఆయన సమాధానమిచ్చారు. 7వ తేదీన విచారణకు వచ్చే అవకాశాన్ని పరిశీలిస్తానని రాంగోపాల్‌వర్మ చెప్పినట్లు సమాచారం.

గతంలో రెండుసార్లు ఆర్జీవీకి పోలీసులు నోటీసులు ఇచ్చినప్పటికీ విచారణకు హాజరుకాలేదు. అనంతరం హైకోర్టును ఆశ్రయించడంతో ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరైంది. దర్యాప్తునకు సహకరించాలని, పోలీసులు కోరినప్పుడు విచారణకు అందుబాటులో ఉండాలని వర్మకు ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో మరోసారి పోలీసులు నోటీసులు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు 'వ్యూహం' సినిమా ప్రమోషన్ సమయంలో తెదేపా అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వ్యక్తిత్వాలను కించపరిచేలా సోషల్ మీడియా వేదికగా రాంగోపాల్ వర్మ అసభ్యకర పోస్టులు పెట్టారంటూ ప్రకాశం జిల్లా మద్దిపాడు మండల తెదేపా ప్రధాన కార్యదర్శి రామలింగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాని ఆధారంగా పోలీసులు వర్మపై కేసు నమోదు చేశారు.

# వారితో పర్యటన చాలా సంతృప్తి ఇచ్చింది: మంత్రి టీజీ భరత్

కర్నూలు: దావోస్ పర్యటన గ్రాండ్ సక్సెస్ అయ్యిందని, సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌తో కలిసి వెళ్లిన ఈ పర్యటన చాలా సంతృప్తిని ఇచ్చిందని మంత్రి టీజీ భరత్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన కర్నూలులో మాట్లాడుతూ... ఇండియాలో పెట్టుబడులు పెట్టాలి అంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుర్తుకు వచ్చేలా ముఖ్యమంత్రి చంద్రబాబు దావోస్‌లో పారిశ్రామిక వేత్తలకు వివరించారని అన్నారు. ఈ క్రమంలో పారిశ్రామిక, వ్యాపార వేత్తలు ఏపికి రావడానికి ఆసక్తితో ఉన్నారని సంతోషం వ్యక్తం చేశారు. చాలా తక్కువ వ్యవధిలోనే ఆంధ్రప్రదేశ్ రూపు రేఖలు మారనున్నాయని, భారీ పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయని మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. ఆరు నెలల లోపే ఈ అభివృద్ధి ఫలితాలు ప్రజలకు కనిపిస్తాయన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనతో పారిశ్రామిక, వ్యాపార వేత్తలు భయపడి పారి పోయారని.. అలాంటి వారంతా ఇప్పుడు ఏపీకి రావడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు పెట్టుబడులు తెచ్చామని అన్నారు... అయితే ఏ ఒక్కటి ఆచరణలో పెట్టలేదని మంత్రి టీజీ భరత్ విమర్శించారు. కాగా దావోస్ పర్యటనకు వెళ్లినప్పుడు జ్యూరిక్‌లో తెలుగు పారిశ్రామికవేత్తలతో నిర్వహించిన సమావేశంలో మంత్రి టీజీ భరత్ మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో పారిశ్రామికవేత్తలు వివిధ రాష్ట్రాలతో చర్చలు జరుపుతున్నారని, చివరకు ఎక్కడ ఎక్కువ సబ్సిడీలు లభిస్తే ఆ రాష్ట్రానికే వెళ్లిపోతున్నారని అన్నారు. ఏపీలో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పారిశ్రామిక




ప్రోత్సాహకాలతో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేస్తోందని చెప్పారు. పైగా చంద్రబాబు బ్రాండ్ తమ రాష్ట్రానికి అదనపు అడ్వాంటేజ్‌గా పేర్కొన్నారు. అందుకే 7 నెలల్లోనే రాష్ట్రంలో రూ. లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి బీపీసీఎల్, రిలయన్స్, ఎన్‌టీపీసీ, మిట్టల్ స్టీల్స్ వంటి కంపెనీలు ముందుకొచ్చాయన్నారు. స్విట్జర్లాండ్ నుంచి కూడా పారిశ్రామికవేత్తలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారని, వారికి అన్ని విధాలుగా సహకరిస్తామని మంత్రి టీజీ భరత్ హామీ ఇచ్చారు. కచ్చితంగా తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్‌ను కొన్ని దశాబ్దాలపాటు పరిపాలిస్తుందని, అందుచేత ఎలాంటి సమస్యా ఉండదని వారికి భరోసా ఇచ్చారు.




అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత భద్రత, భరోసా వచ్చిందని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. పెట్టుబడిదారులను ఆహ్వానించేలా ఒక సానుకూల వాతావరణం ఏర్పడిందన్నారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి అనగాని, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌రావు, ఎంపీ శ్రీభరత్ మీడియాతో మాట్లాడారు. మంత్రి అనగాని మాట్లాడుతూ.. "ఎవరి వల్ల మంచి జరుగుతుందో రాష్ట్ర ప్రజలంతా చూస్తున్నారు. ఎప్పటినుంచో ఉన్న సమస్యలకు కూడా పరిష్కారం చూపిస్తున్నాం. సింహాచలం పంచగ్రామాల సమస్య కూడా త్వరలోనే పరిష్కారం కాబోతోంది. దాదాపు 500 ఎకరాల భూమిని ప్రత్యామ్నాయంగా ఇచ్చి 12,149 ఇళ్లను రెగ్యులరైజ్ చేసేందుకు నిర్ణయం తీసుకున్నాం. గతంలో (2018-19)లో జీవో నెం.225 ఇచ్చాం. ఎంత భూమి ఆక్రమణకు గురైందో.. దానికి సమానంగా భూమి ఇచ్చేందుకు ఆనాడు నిర్ణయించారు. జీవో రాగానే కొంత మంది కోర్టుకు వెళ్లారు. గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం ఎలాంటి న్యాయం చేయలేకపోయింది. సుమారు 12,149 కుటుంబాలకు న్యాయం చేయాలనే ఆలోచన కూడా వైకాపా ప్రభుత్వం చేయలేకపోయింది. సింహాచలం భూములను ఆక్రమించి 12,149 ఇళ్లను నిర్మించుకున్నారు. వాటి క్రమబద్ధీకరణకు గతంలోనూ ప్రయత్నాలు చేశాం. ఇప్పుడు సీఎం చంద్రబాబు నిర్ణయం మేరకు 420 ఎకరాలకు బదులుగా 610 ఎకరాలు (సమాన రిజిస్ట్రేషన్ విలువతో) సింహాచలం దేవస్థానానికి బదలాయించాలని నిర్ణయం తీసుకున్నాం. దీని రిజిస్ట్రేషన్ విలువ రూ.5,300 కోట్ల వరకూ ఉంది. పెదగంట్యాడ, గాజువాక తదితర ప్రాంతాల్లో సింహాచలం దేవస్థానానికి 610 ఎకరాల భూమి ఇస్తున్నాం.

దేవస్థానానికి చందనం చెట్లను పెంచుకునేందుకు అవకాశం ఉన్న చోట భూమి ఇస్తున్నాం. గాజువాకలో ఇనాం భూమిని క్రమబద్ధీకరించేందుకు నిర్ణయం తీసుకున్నాం. తెదేపా హయాంలో ఇచ్చిన డీడ్‌ను గత ప్రభుత్వం పట్టించుకోలేదు. అందుకే పట్టాలు ఇచ్చి రెండేళ్లలోనే శాశ్వత హక్కులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ అంశంపై గురువారం కౌంటర్ దాఖలు చేయబోతున్నాం. కోర్టులో మాకు సానుకూల స్పందన వస్తుందని భావిస్తున్నాం. తీసుకున్న భూమికంటే ఎక్కువ విలువ ఉండేలా.. అందరికీ వెసులుబాటు కలిగించేలా నిర్ణయం తీసుకుంటున్నాం. రానున్న రెండు మూడు నెలల్లో పరిష్కార మార్గం లభిస్తుందని ఆశిస్తున్నాం" అని అన్నారు.




దిల్లీ: గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో ప్రదర్శించిన శకటాల్లో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో నిలిచింది. తొలి రెండు స్థానాల్లో ఉత్తర ప్రదేశ్, త్రిపుర ఉన్నాయి. ఏపీ ప్రదర్శించిన ఏటికొప్పాక బొమ్మల శకటానికి మూడోస్థానం దక్కింది. ఈ మేరకు పరేడ్ శకటాల ఫలితాలను రక్షణ మంత్రిత్వశాఖ ప్రకటించింది. త్రివిధ దళాల్లో జమ్మూకశ్మీర్ రైఫిల్స్ కవాతు బృందం, కేంద్ర బలగాల విభాగంలో దిల్లీ పోలీసు కవాతు బృందం ఉత్తమ మార్చింగ్ కంటింజెంట్‌గా ఎంపికయ్యాయి. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ శకటంగా గిరిజన శాఖ శకటం ఎంపికైనట్లు రక్షణ శాఖ పేర్కొంది. జయతి జయ మహా భారతం ప్రదర్శించిన కళాకారులతో పాటు కేంద్ర ప్రజా పనుల విభాగ శకటం ప్రత్యేక బహుమతికి ఎంపికయ్యాయి. మైగవ్ పోర్టల్ ద్వారా జరిపిన ఓటింగ్‌లో ప్రజల ప్రత్యేక ఎంపిక విభాగంలో త్రివిధ దళాల నుంచి ఆర్మీ సిగ్నల్స్ బృందానికి, పారా మిలిటరీ బలగాల నుంచి సీఆర్‌పీఎఫ్ కవాతు బృందాలు ఉత్తమ ప్రతిభ కింద ఎంపికైనట్లు రక్షణశాఖ తెలిపింది. శకటాల్లో గుజరాత్ తొలి స్థానంలో నిలవగా.. తరవాతి రెండు స్థానాల్లో ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల శకటాలు ఉన్నట్లు వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో మహిళా శిశు సంక్షేమ శాఖ శకటానికి ఎక్కువ మంది మైగవ్‌లో ఎంపిక చేసినట్లు రక్షణశాఖ ప్రకటించింది. గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో ఉత్తమ కంటింజెంట్, శకటాలను కమిటీ ఎంపిక చేసింది. దీంతో పాటు మైగవ్ పోర్టల్‌లోనూ కేంద్రం ఓటింగ్ నిర్వహించింది.

# పెద్దిరెడ్డి భూ ఆక్రమణలపై విచారణకు కమిటీ ఏర్పాటు




అమరావతి: వైకాపా నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అటవీ భూముల ఆక్రమణలపై విచారణకు ఏపీ ప్రభుత్వం ఆదేశించింది. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు జాయింట్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో చిత్తూరు కలెక్టర్ సుమిత్, ఎస్పీ మణికంఠ చందోలు, ఐఎఫ్ఎస్ అధికారి యశోదాబాయ్‌ను సభ్యులుగా నియమించింది. పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదిక సమర్పించాలని కమిటీని ఆదేశించింది. కమిటీ నివేదిక అనంతరం ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకోనుంది.

# పెద్దిరెడ్డి భూ ఆక్రమణలపై విచారణకు పవన్‌కల్యాణ్ ఆదేశం

అమరావతి: వైకాపా నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అటవీ భూముల ఆక్రమణలపై డిప్యూటీ సీఎం, అటవీశాఖ మంత్రి పవన్‌కల్యాణ్ విచారణకు ఆదేశించారు.

పెద్దిరెడ్డిపై చిత్తూరు జిల్లా మంగళంపేట సమీపంలోని అడవుల్లో భూకబ్జా చేసినట్లు ఆరోపణ లు ఉన్నాయి. ఈ వ్యవహారంపై విచారణ జరిపి నివేదిక సమర్పించాల ని పీసీసీఎఫ్ (ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్)ను పవన్ ఆదేశిం చారు. అటవీ భూముల ఆక్రమణలు, అడవుల ధ్వంసంపై విచారణ చేపట్టాలని స్పష్టం చేశారు. రికార్డుల తారుమారులో ఎవరి పాత్ర ఉంది? లబ్ధి పొందిందెవరో తేల్చాలని.. దీనిపై చట్టపరంగా ముందుకెళ్లాలన్నారు. సత్వరమే ప్రాథమిక నివేదిక అందించాలని పీసీసీఎఫ్‌ను పవన్ ఆదేశించారు.



# మా తమ్ముడిపై వార్తలు రాస్తే రైలు పట్టాలపై పడుకోబెడతా.. ఎమ్మెల్యే గుమ్మనూరు వార్నింగ్



గుంతకల్లు: మాజీ మంత్రి, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం జర్నలిస్టులపై బెదిరింపులకు పాల్పడ్డారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'మా తమ్ముడిపై వార్తలు రాస్తే రైలు పట్టాలపై పడుకోబెడతా' అని ఆయన హెచ్చరించినట్లు అందులో ఉంది. ప్రశ్నలేమైనా ఉంటే తన ఎదుటే అడగాలన్నారు. తాను వెళ్లాక తనపై తప్పుగా రాస్తే ఊరుకునేది లేదని చెప్పారు.

# తప్పుడు ప్రచారం.. యూట్యూబ్ ఛానళ్లపై కేసు నమోదు..

తిరుపతి: తిరుమల ఆలయంపై తప్పుడు ప్రచారం చేసిన మూడు యూట్యూబ్ ఛానళ్లపై ఎస్వీ యూనివర్శిటీ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ఇటీవల శ్రీవారి దర్శనార్థం తిరుమలకు విచ్చేశారు. అయితే ఆయనకు సరైన దర్శనం కల్పించినప్పటికీ తప్పుడు ప్రచారం జరగడంపై టీటీడీ ఆగ్రహం వ్యక్తం చేసింది. చాగంటికి వసతుల విషయంలో ఆలయ అధికారులు నిర్లక్ష్యం వహించారని, తగిన ఏర్పాట్లు చేయలేదని దయల్ న్యూస్, జర్నలిస్టు వైఎస్ఆర్, పోస్టు 360 అనే యూట్యూబ్ యూట్యూబ్ ఛానళ్లు ప్రసారం చేశాయి. ఇవి కాస్త టీటీడీ దృష్టికి రావడంపై అధికారులు సీరియస్ అయ్యారు. తిరుమల ఆలయంపై తప్పుడు ప్రసారాలు చేశారంటూ టీటీడీకి చెందిన పురాణ, ఇతిహాసాల ప్రాజెక్టు ప్రత్యేకాధికారి ఏవీఎస్ఎస్ విభీషణ్ శర్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మూడు ఛానళ్లపై కేసు నమోదు చేసిన ఎస్వీ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# కియరా గ్లామర్ ఫైర్..!

అందాల భామ కియరా అద్వాని ఆఫ్టర్ మ్యారేజ్ సినిమాలైతే చేస్తుంది కానీ అందుకు తగినట్టుగా సక్సెస్ లు మాత్రం అందుకోవట్లేదు. ముఖ్యంగా సౌత్ పై ప్రేమ కొద్దీ అమ్మడు చేస్తున్న ప్రయత్నాలన్నీ రివర్స్ అవుతున్నాయి. అటు బాలీవుడ్ లో బిజీగా ఉన్నప్పుడే మహేష్ బాబు కోసం భరత్ అనే నేను సినిమా చేసిన కియరా ఆ సినిమాతో హిట్ అందుకుంది. ఐతే ఆ నెక్స్ట్ సినిమా రామ్ చరణ్ తో వినయ విధేయ రామ చేసింది. ఆ సినిమా రిజల్ట్ అందరికీ తెలిసిందే. ఐతే మళ్లీ కొద్దిపాటి గ్యాప్ తో మరోసారి రామ్ చరణ్ తోనే సినిమా చేసింది కియరా అద్వాని. గేమ్ ఛేంజర్ లో రామ్ చరణ్ తో అమ్మడు కలిసి నటించింది. ఆ సినిమా ఫలితం కూడా అమ్మడిని నిరాశ పరచింది. మరోపక్క బాలీవుడ్ లో లాస్ట్ ఇయర్ ఏ



సినిమా పడలేదు. ఈ ఇయర్ వార్ 2 ఉంది. యష్ టాక్సిక్ లో కూడా కియరా హీరోయిన్ గా చేస్తుంది. ఈ రెండు సినిమాల మీదే కియరా తన హోప్స్ పెట్టుకుందని చెప్పొచ్చు. ఇక సినిమాలతో సంబంధం లేకుండా అమ్మడు ఫోటో షూట్స్ తో గ్లామర్ అప్పీల్ చేస్తుంది. కియరా సోషల్ మీడియా ఫోటోస్ కి సూపర్ డిమాండ్ ఉంటుంది. లేటెస్ట్ గా అమ్మడు వైట్ కలర్ డ్రెస్ అది కూడా అక్కడక్కడ స్పెషల్ డిజైన్ తో ఉంది. ఈ ఫోటోస్ చూసిన ఎవరైనా సరే కియరా మాయలో పడిపోక తప్పదు. మామూలుగా అయితే పెళ్లయ్యాక ఎవరికైనా అందం తగ్గుతుందని అంటారు కానీ కియరా విషయంలో అది రివర్స్ అవుతుంది. రోజు రోజుకి అమ్మడి అందం రెట్టింపు అవుతున్నట్టు ఉంది. సినిమాలు సరిగా ఆడకపోయినా తన ఫోటో షూట్స్ తో ఆడియన్స్ హృదయాల్లో సూపర్ హిట్ అనిపించుకుంటుంది అమ్మడు. వార్ 2, టాక్సిక్ ఈ రెండు సినిమాలతో కియరా మళ్లీ తిరిగి సక్సెస్ ట్రాక్ లోకి రావాలని చూస్తుంది. మరి ఈ సినిమాలైనా కియరాని కాపాడుతాయేమో చూడాలి. ఐతే వరుస సినిమాలు నిరాశపరుస్తున్నా తన ఫోకస్ ఏమాత్రం తగ్గించట్లేదు కియరా. అటు సినిమాలు ఇటు ఫోటో షూట్స్ అంటూ రెగ్యులర్ గా ఆడియన్స్ తో టచ్ లో ఉంటుంది. కియరా కష్టాన్ని చూసిన ఎవరైనా సరే హిట్టు పడాలని కోరతారు. తప్పనిసరిగా అమ్మడికి రాబోయే రోజులు కలిసి వచ్చేలా ఉన్నాయని చెప్పొచ్చు.

## రీల్ అండ్ రియల్ లైఫ్ మధ్య రష్మిక క్లారిటీ ఇలా!

సినిమా అన్నది ఓ మాయా ప్రపంచం. ఖరీదైన జీవితం..రంగుల ప్రపంచం మనిషినే మార్చేస్తుంది. సినిమా రంగంలో ఎంతో బ్యాలెన్స్ చేయాల్సి ఉంటుంది. ఆ బ్యాలెన్సింగ్ అదుపు తప్పితే పరిస్థితి ఎలా ఉంటుంది? అనడానికి ఎన్నో ఉదాహరణలున్నాయి. ఇండస్ట్రీ ఎంత వేగంగా ఆకాశానికి ఎత్తగలతో? అంతకు మించిన వేగంతో పాతాళానికి తొక్కేయగలదు. క్రమశిక్షణ అన్నది మాత్రమే ఎక్కడైనా పైకి తీసుకు రాగలదు. ఇండస్ట్రీలో అది ఎక్కువగా ఉంటే? జీవితం అంత గొప్పగానూ సాగుతుంది. ఇదే విషయాన్ని మెగాస్టార్ చిరంజీవి నవతరాన్ని ఉద్దేశించి చెబుతుంటారు. ఈ విషయాన్ని నేషనల్ క్రష్ రష్మిక మందన్న కూడా బాగానే వంట పట్టించు కుంది. ఇండస్ట్రీలో స్టార్ డమ్.. ప్రజాదారణ..డబ్బు ఏదీ శాశ్వతం కాదని అంటోంది. ప్రోపెషనల్ గా ఎంత గొప్ప జీవితమైనా? వ్యక్తిగతంగా



తానెంత సంతోషంగా ఉన్నానన్నదే ముఖ్యమంటోంది. కుటుంబానికి ఇప్పుడు కావాల్సినంత సమయాన్ని కేటాయించకలేకపోయినా? కుటుంబాన్నే మర్చిపోయేంత బిజీగా ఉన్నా? డబ్బు చేతిలో ఉన్నా? కుటుంబ విలువలకు..మూలాలకు మాత్రం తానెప్పుడు మొదటి ప్రాముఖ్య తనిస్తానని తెలిపింది. ప్రతీ నటీ, నటుడు వారి జీవితంలో ఏదో ఒక దశలో ప్రతికూల పరిస్థితులు...క్షీణత ఎదుర్కో వాల్సి ఉంటుందని...ఇప్పుడెలా ఉన్నాం అన్నది ఎంత ముఖ్యమో! అదుపు తప్పితే ఎలా ఉంటాం? అన్నది కూడా ఆలోచించుకుని ముందుకు వెళ్లాలంటోంది. వాస్తవ జీవితంలో ఎల్లుప్పుడు తోడు ఉండే వాళ్లను ఎప్పుడూ మర్చిపోకూడదని కుటుంబం, స్నేహితులు, సన్నిహితులు వారంతా ప్రోఫెషనల్ లైఫ్ కంటే ముఖ్యమని అభిప్రాయపడింది. సినిమా అనేది తన జీవితంలోకి అనుకోకుండా వచ్చిందని... ఇప్పుడా జీవితం బాగుందని తొలి జీవితాన్ని ఎలా మర్చిపోతానని తనని తానే ప్రశ్నించుకుంది. మొత్తానికి వృత్తి-వ్యక్తిగత జీవితంలో రష్మిక పక్కా క్లారిటీతో ఉందని తెలుస్తోంది.




# తండేల్ ట్రైలర్ టాక్: ఏమోషన్ కథలో హై వోల్టేజ్ యాక్షన్




తండేల్ సినిమాపై అంచనాలు ఏ స్థాయిలో ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేసు. నాగచైతన్య సాయి పల్లవి జంటగా నటించిన ఈ సినిమాను దర్శకుడు చందూ మొండేటి సరికొత్త తరహాలో ప్రజెంట్ చేయనున్నట్లు పోస్టర్స్ తోనే క్లారిటీ ఇచ్చారు. శ్రీకాకుళం బ్యాక్ డ్రాప్ లో నిజజీవితంలోని సంఘటనల ఆధారంగా ఈ సినిమా రూపొందుతోంది. సముద్రతీరంలో పాకిస్తాన్ చేతికి చిక్కిన తండేల్ రాజు అలాగే అతని స్నేహితులు ఎలాంటి అనుభవాలు ఎదుర్కొన్నారు అనే అంశాన్ని సినిమాలో హైలెట్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఇక సాయి పల్లవితో ఎమోషనల్ లవ్ స్టోరీ కూడా ఇందులో ప్రధానంగా హైలెట్ కానుంది. ఇక ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అసలు ట్రైలర్ రానేవచ్చింది. ట్రైలర్ రిలీజ్ అయి, అక్కినేని అభిమానుల్లో మంచి జోష్ నింపింది. చందూ మొండేటి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ భారీ యాక్షన్, ఎమోషనల్ డ్రామా ట్రైలర్ సినిమాపై ఉన్న అంచనాలను మరింత పెంచేసింది. ట్రైలర్ ప్రారంభం నుంచే ఆసక్తికరమైన విజువల్స్‌తో ఆకట్టుకుంటూ, నాగచైతన్య కెరీర్‌లో మరో సూపర్ హిట్ అందజేయనున్నట్టు హింట్ ఇస్తోంది. ట్రైలర్‌లో నాగచైతన్య మాస్ లుక్, యాక్షన్ సన్నివేశాలు అద్భుతంగా చూపించారు. “పండగ నుండి రాజుగాడే మన తండేల్” అనే డైలాగ్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేపుతోంది. సముద్రంలో సాహసాలు, మోసగాళ్లతో యుద్ధాలు, బుజ్జితల్లితో కూడిన భావోద్వేగ సన్నివేశాలు ట్రైలర్‌లో హైలైట్ అయ్యాయి. ముఖ్యంగా దేవి శ్రీ ప్రసాద్ సంగీతం మరోసారి మ్యూజికల్ ట్రీట్ ఇస్తుందనే భావన కలిగిస్తోంది. మనం ఫేమస్ అయిపోయినట్లే.. అంటూ ఇద్దరి మధ్య వచ్చే సంభాషణ మరింత హైలెట్ అయ్యింది. బుజ్జితల్లి క్యారెక్టర్ కూడా కథనానికి భావోద్వేగం అందించడానికి ప్రధానంగా నిలుస్తుందని తెలుస్తోంది. చైతన్య, సాయి పల్లవి మధ్య కెమిస్ట్రీ ట్రైలర్‌లోనే అందరినీ ఆకట్టుకుంది. ఇక వెండితెరపై ఏ రేంజ్ లో ఉంటుందో అనే భావనను కలిగిస్తోంది. ఇక వేటకు వెళ్లిన రాజు పాకిస్తాన్ కు చిక్కడంతో అక్కడ ఎదుర్కోన్న అనుభవాలు ఆడియెన్స్ ను ఆలోచింపజేసేలా ఉన్నాయి. “మా దేశంలో ఉన్న ఊరకుక్కలన్ని ఉత్తరం వైపు తిరిగి పోస్తే... ప్రపంచ పటంలో పాకిస్తాన్ లేకుండా పోయిద్ది.” తన వారి కోసం పోరాడేవాడే “తండేల్” అనే లైన్ కూడా ఆకట్టుకుంటోంది. ట్రైలర్‌లో యాక్షన్ సన్నివేశాలు, గ్రాండియర్ విజువల్స్, భావోద్వేగ దృశ్యాలు, సునిశితమైన కథాంశం అన్ని కలగలిసినట్లుగా అనిపిస్తోంది. సముద్రంలో జరుగుతున్న యాక్షన్ సీన్స్‌ను భారీ స్థాయిలో తెరకెక్కించినట్లు ట్రైలర్ చూపిస్తోంది. ముఖ్యంగా రియలిస్టిక్ విజువల్స్ అందించిన కెమెరా వర్క్ ట్రైలర్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చందూ మొండేటి దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా, గీతా ఆర్ట్స్ సమర్పణలో బన్నీ వాసు నిర్మించారు. భారీ బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రంలో ప్రతి ఫ్రేమ్‌లోనూ అదే గ్రాండియర్ కనిపిస్తోంది. ట్రైలర్ చివర్లో చూపించిన క్లైమాక్స్ షాట్స్ ప్రేక్షకులను థ్రిల్‌కు గురి చేస్తాయి. ఈ సినిమా కచ్చితంగా బాక్సాఫీస్ వద్ద బిగ్ హిట్ అయ్యే ఛాన్స్ ఉన్నట్లు అనిపిస్తోంది. ఇక ఫిబ్రవరి 7న సినిమా విడుదలతో తండేల్ ఎలాంటి హైప్ క్రియేట్ చేస్తుందో చూడాలి.

# థియేట్రికల్ రిలీజ్ లను ఓటీటీలు శాషిస్తున్నాయా?





సినిమా థియేట్రికల్ రిలీజ్ లను కూడా ఓటీటీలు శాషిస్తున్నాయా? ఓటీటీలు చెప్పిన కండీషన్ ప్రకారమే సినిమా రిలీజ్ అవ్వాల్సిన పరిస్థితి ఉందా? వాళ్లు చెప్పిన రిలీజ్ ఫార్మెట్ నే నిర్మాతలు పాటించాల్సిన పరిస్థితులు దాపరిచించాయా? అంటే సన్నివేశం అలాగే కనిపిస్తోంది. సినిమా ఓటీటీ బిజినెస్ విషయంలో కంపెనీలు కొండెక్కి కూర్చోవడంతో? కొన్ని సినిమాలు.... కొంత మంది నిర్మాతలు ఓటీటీల నుంచి ఇబ్బందులు ఎదుర్కోంటోన్న సంగతి తెలిసిందే. ఫ్లాప్ ల్లో ఉన్న హీరోల సినిమాల పరిస్థితి అయితే మరీ దారుణంగా కనిపిస్తుంది. చియాన్ విక్రమ్ నటించిన ‘వీర ధీర సూరన్ 2’జనవరిలో రిలీజ్ అవ్వాలి. కానీ ఓటీటీ మార్చిలో రిలీజ్ చేయాలి? అనే కండీషన్ పెట్టడంతో థియేట్రికలర్ రిలీజ్ వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. అలా చేసుకుంటనే ఓటీటీ రైట్స్ తీసుకుం టామానే నిబంధన పెట్టడంతో చేసేందేం లేక వాళ్లు చెప్పినట్లు చేయాల్సి వస్తోంది. వాళ్లు చెప్పినట్లు చేస్తే సేఫ్ జోన్ లో ఉండొచ్చు అన్నది నిర్మాత ప్లాన్. హిట్ అయినా ఫ్లాప్ అయినా? ఓటీటీ చెప్పినట్లు చేసాం కాబట్టి ఎలాగూ ఎంతో కొంతకు రైట్స్ తీసుకుంటారనే ధీమా ఉంటుంది. అలాగే మోహన్ లాల్ నటించిన ‘తుడారుమ్’ కూడా జనవరి 30న రిలీజ్ అవ్వాలి. కానీ ఈ సినిమా ఏకంగా మేకి వాయిదా పడిందనే ప్రచారం జరుగుతోంది. కారణం ఏంటా? అని ఆరా తీయగా ఓటీటీ తో ఒప్పందం కుదరక పోవడంతోనే ఇలా వాయిదా వేయాల్సి వచ్చిందన్న విషయం వెలుగులోకి వచ్చింది. ముందుగా ప్రీ థియేట్రికల్ రిలీజ్ ఒప్పందానికి సదరు ఓటీటీ ఒకే చెప్పిందిట.

కానీ ప్రాజెక్ట్ సంతకం చేరే దశకు చేరుకున్న సమయంలో రిలీజ్ తర్వాత ఒప్పందం చేసుకుందామనే వాదన తెచ్చిందిట. అదే సమయంలో రిలీజ్ తేదీ కూడా తామే చెబుతాం? అన్నట్లు సదరు ఓటీటీ వ్యవహరించిందిట . దీంతో చేసేదేం లేక రిలీజ్ వాయిదా పడింది. అగ్ర హీరోల సినిమాల విషయంలోనే పరిస్థితి ఇలా ఉందంటే? మిగతా హీరోల పరిస్థితి చెప్పాల్సిన పనిలేదు.

# ఎంతమంది ఫ్యాన్స్ ఉన్నా ఇంట్లో కూతురినే: రష్మిక

యానిమల్, పుష్ప2 సినిమాలతో తన సత్తాను పాన్ ఇండియా లెవెల్ లో చాటిన నేషనల్ క్రష్ రష్మిక మందన్నా బాలీవుడ్ లో విక్కీ కౌశల్ తో కలిసి చేసిన చావా సినిమా రిలీజ్ కు రెడీ అయిన విషయం తెలిసిందే. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. రిలీజ్ దగ్గర పడుతున్న నేపథ్యంలో చావా చిత్ర మేకర్స్ ప్రమోషన్స్ ను వేగవంతం చేశారు. ఈ ప్రమోషన్స్ లో రష్మిక చాలా యాక్టివ్ గా పాల్గొంటుంది. మొన్న జరిగిన ట్రైలర్ లాంచ్ కు కూడా రష్మిక కాలు బాలేకపోయినా కుంటుతూ ఈవెంట్ కు హాజరైంది. ఈ నేపథ్యంలో రష్మిక తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన పర్సనల్ లైఫ్ గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించింది. తనకు ఇంట్లో ఉండటమంటే చాలా ఇష్టమని, ఇంట్లో ఉన్నప్పుడు ఎంతో సంతోషంగా, పాజిటివ్ గా అనిపిస్తుందని, ఎక్కడా



దక్కని ఆనందం ఇంట్లో ఉంటే దక్కుతుందని, అదే తన హ్యాపీ ప్లేస్ అని చెప్తోంది రష్మిక. బయట తనకెంతో మంది ఫ్యాన్స్ ఉన్నప్పటికీ ఇంట్లో తాను ఒక కూతురు, సోదరి, భాగస్వామి అని అదంతా తన వ్యక్తిగత జీవితమని, దాన్ని తానెంతో గౌరవిస్తానని రష్మిక తెలిపింది. కాబోయే వ్యక్తిలో ఏ విషయాలు మీకు నచ్చుతాయని ఈ సందర్భంగా రష్మికను అడగ్గా, నవ్వుతూ ఉండే వాళ్లంటే తనకు ఇష్టమని, ఎదుటివారిని గౌరవించే వ్యక్తులను తాను ఇష్టపడతానని, ఎదుటివారిలో ముందుగా కళ్లు చూస్తానని రష్మిక తెలిపింది. రష్మిక మాటలు విని అందరూ అమ్మడు రిలేషన్‌షిప్ లో ఉందని కామెంట్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే టాలీవుడ్ యంగ్ హీరో విజయ్ దేవరకొండతో రష్మిక ప్రేమలో ఉందని ఎప్పట్నుంచో వార్తలొస్తున్న విషయం తెలిసిందే. కానీ ఎప్పటికప్పుడు వారిద్దరూ తమ మధ్య ఉన్నది కేవలం స్నేహం మాత్రమే అని చెప్తున్నప్పటికీ, ఈ ప్రేమ వార్తలు మాత్రం ఆగడం లేదు. అయితే రష్మిక, విజయ్ ఎంత లేదని చెప్పినా వారిద్దరూ రిలేషన్ లో ఉన్నారనే విషయం అందరికీ తెలిసిందే.

ఇక చావా సినిమా విషయానికొస్తే రష్మిక కు చాలా పవర్‌ఫుల్ పాత్ర దక్కిందని బాలీవుడ్ వర్గాలు చెప్తున్నాయి. ఈ సినిమాలో రష్మిక చేస్తున్నది శంభాజీ భార్య యేసుబాయ్ బోన్సాలే పాత్ర. శంభాజీ చనిపోయాక రాయగడ్ సంస్థానాన్ని కాపాడుకోవడానికి యేసుబాయ్ చేసిన యుద్ధం గురించి ఇప్పటికీ ఎంతో గొప్పగా చెప్పుకుంటారు. మరాఠా సామ్రాజ్యపు మహారాణిగా యేసుబాయ్ గురించి, ఆ సామ్రాజ్యానికి ఆమె చేసి సేవలు మరువలేనివని చెప్పుకుంటారు. ఈ లెక్కన రష్మిక పాత్ర చావాలో చాలా పెద్దదే.

## దేవుని దేశంలో దేవతలా మెరిసిపోతున్న జాన్వీ

తెల తెల్లని కాటన్ చీర.. మ్యాచింగ్ స్లీవ్ లెస్ బ్లౌజు ధరించి కొంటె కోనంగి క్రీగంటి చూపులతో కిల్ చేస్తోంది. అలా అందమైన శిరోజాలను సరిచేస్తూ ముడి వేస్తూ ఒద్దికగా కళ్లు తిప్పుతూ కనిపించింది. గుండెల్లో జిల్లనిపిస్తోంది. కుర్రకారు మనసును గుల్ల చేస్తోంది.. అంతగా కిక్కిస్తున్న ఈ దేవకన్య ఎవరో ఆరా తీస్తున్నారా? అంతగా ఆరాలు అవసరం లేదు. ఈ బ్యూటీ పేరు- జాన్వీ కపూర్. మామ్ శ్రీదేవి నటవారసురాలు. తనదైన ఫ్యాషన్ సెన్స్‌తో నిరంతరం యువతరం హృదయాలను కొల్లగొడుతున్న జాన్వీ కపూర్ ఈసారి తెల్ల చీరలో జిల్లనిపించింది. ప్రస్తుతం దేవుని దేశం కేరళ పచ్చదనంలో ప్రకృతి దేవతలా ఒదిగిపోయింది. ప్రతిచోటా మెరుపులే మెరుపులు.. తెల్ల చీరలో రకరకాల భంగిమల్లో జాన్వీ కెమెరాలకు ఫోజులిచ్చింది.



ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్స్ ఇంటర్నెట్ లో వైరల్‌గా మారాయి. చర్చిలో నిశ్శబ్ద క్షణాలు గడపడం.. సూర్యరశ్మిలో సమయం కేటాయించడం.. కేరళ సహజ సౌందర్యాన్ని.. ప్రశాంతతను ఆస్వాధించడం.. ఏనుగులకు ఆహారం ఇవ్వడం.. స్నేహితులతో టీ తాగడం.. ఇలా ప్రతిదీ ఆనందాన్నిచ్చేదే. ముఖ్యంగా ప్రకృతితో సాంత్వన దొరుకుతుంది. అలాంటి సాంత్వనను తన సొంతం చేసుకున్న ఆనందం జాన్వీలో కనిపిస్తోంది. క్షణం తీరిక లేని షెడ్యూళ్లతో ముంబై నగరంలో బిజీబిజీగా ఉండే జాన్వీ, ఇప్పుడు కేరళ యాత్రలో పూర్తిగా రిలాక్స్ అవుతోంది. జాన్వీ నటించిన దేవర గత ఏడాది విడుదలై పాన్ ఇండియన్ హిట్ గా నిలిచింది. ప్రస్తుతం తన సోదరి ఖుషికపూర్ నటించిన మొదటి చిత్రం లవ్ యాపా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా ఖుషి సినిమాకు ప్రచార సాయం చేస్తోంది.



# బ్యాగుల కుప్పలు.. చెల్లాచెదురుగా దుస్తులు

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళాలో నేడు విషాదం చోటుచేసుకుంది. మౌని అమావాస్య సందర్భంగా నెలకొన్న రద్దీతో తొక్కిసలాట జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయారు. భక్తుల తాకిడి విపరీతంగా ఉండడంతో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు అధికారులు తెలిపారు. పుణ్యస్నానాలకు ఎటు వెళ్లాలో తెలియకపోవడం వల్లే గందరగోళం తలెత్తిందని కొంతమంది భక్తులు చెబుతున్నారు. తొక్కిసలాట తర్వాత కన్పించిన దృశ్యాలు.. ఘటన తీవ్రతకు అద్దం పడుతున్నాయి. ఘటనా స్థలంలో బ్యాగుల కుప్పలు.. చెల్లాచెదురుగా పడిన భక్తుల దుస్తులు, బూట్లు దర్శనమిచ్చాయి. మౌని అమావాస్య నాడు గంగానదిలో ప్రత్యేకించి త్రివేణి సంగమంలోని జలాలు అమృతంతో సమానంగా ఉంటాయనేది విశ్వాసం. ఈ సమయంలో పుణ్యస్నానమాచరిస్తే ఎన్నో జన్మల పుణ్యం లభిస్తుందనే నమ్మకంతో నేడు కుంభమేళాకు భక్తులు పోటెత్తారు. త్రివేణి సంగమం ప్రధాన ఘాట్ వద్ద పుణ్యస్నానాలు చేసేందుకు వెళ్లారు. ఈక్రమంలోనే కొందరు బారికేడ్లను దాటేందుకు ప్రయత్నించగా.. అవి విరిగిపోయాయి. దీంతో ఒక్కసారిగా తోపులాట చోటుచేసుకుంది. పరిస్థితి చేయి దాటిపోవడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వెంట తెచ్చుకున్న బ్యాగులు, లగేజీలతో పరిగెత్తలేక కొంతమంది కింద పడిపోయారు. అధికారులు అప్రమత్తమై పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. క్షతగాత్రులను వెంటనే అంబులెన్సుల్లో స్థానిక ఆసుపత్రులకు తరలించారు. అయితే, రద్దీ ఎక్కువగా ఉండటంతో ఒకానొక దశలో అంబులెన్స్‌కు కూడా దారి లేని పరిస్థితి నెలకొంది. పోలీసులు రంగంలోకి దిగి అంబులెన్స్‌కు మార్గం చూపారు. తొక్కిసలాటతో ఘటనాస్థలంలో భక్తుల బ్యాగులు, ఇతర వస్తువులు చెల్లాచెదురుగా పడిపోయాయి. తమ వస్తువులను వెతుక్కోవడం కోసం భక్తులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం ప్రయాగ్‌రాజ్‌లో పరిస్థితులు అదుపులోకి వచ్చినప్పటికీ భక్తుల రద్దీ మాత్రం విపరీతంగానే ఉంది. ఇప్పటికే దాదాపు 4 కోట్ల మంది త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించగా.. ఇంకా కోట్ల మంది వేచి చూస్తున్నారు. తాజా ఘటన నేపథ్యంలో అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. భక్తులు వెళ్లే మార్గంలో భద్రతను పెంచారు. వారికి సాయంగా వాలంటీర్లు, స్థానిక యంత్రాంగం నిరంతరం పనిచేస్తోంది.

# కుంభమేళాలో తొక్కిసలాట ఘటన.. రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి



ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక కుంభమేళాలో విషాదం చోటుచేసుకుంది. మౌని అమావాస్య సందర్భంగా నెలకొన్న రద్దీ కారణంగా తొక్కిసలాట జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. బాధితులకు అందుతున్న వైద్య సాయంపై ఆరా తీసినట్లు ప్రధాని వెల్లడించారు. "ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాలో తొక్కిసలాట ఘటన బాధాకరం. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా" **– రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము**

"ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాలో చోటుచేసుకున్న విషాదం తీవ్ర విచారకరం. ఈ ఘటనతో తమ ప్రియమైన వారిని కోల్పోయిన భక్తులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా. బాధితులకు స్థానిక యంత్రాంగం అన్నివిధాలా సాయం చేస్తోంది. దీని గురించి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తోనూ మాట్లాడా. రాష్ట్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నా" **– ప్రధాని మోదీ**

మౌని అమావాస్య సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాల కోసం భక్తులు పోటెత్తారు. ఈక్రమంలోనే బుధవారం తెల్లవారుజామున రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. బారికేడ్లు విరగడంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో కనీసం 20 మంది మృతిచెందినట్లు పలు మీడియా కథనాలు చెబుతున్నాయి. అయితే, యూపీ సర్కారు మాత్రం మృతుల సంఖ్యపై అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

# కుంభమేళాలో తొక్కిసలాట.. మోదీ నాలుగుసార్లు ఫోన్ చేశారు: యోగి ఆదిత్యనాథ్



ప్రయాగ్‌రాజ్: ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళాలో మౌని అమావాస్య సందర్భంగా విపరీతమైన రద్దీ ఉండటంతో తొక్కిసలాట జరిగింది. దీనిపై తాజాగా ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మాట్లాడారు. కుంభమేళా వద్ద ప్రస్తుత పరిస్థితులు తెలుసుకునేందుకు ప్రధాని మోదీ ఇప్పటివరకు నాలుగు సార్లు ఫోన్‌లో మాట్లాడారని తెలిపారు "ఈ రోజు తెల్లవారుజామున ఒంటి గంట నుంచి రెండు గంటల మధ్య ఈ ఘటన చోటుచేసుకుంది. బారికేడ్లు ఏర్పాటుచేసినప్పటికీ.. భక్తులు వాటిని దాటాలని ప్రయత్నించడం వల్లే ఈ ఘటన జరిగింది. సుమారు పదికోట్ల మంది స్నానమాచరించేందుకు రావడంతో రద్దీ ఎక్కువగా ఉంది. ప్రధాని మోదీ ఎప్పటికప్పుడు వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. ఉదయం నుంచి నాలుగుసార్లు ఫోన్ చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా ఫోన్ చేశారు" అని వెల్లడించారు. మృతుల గురించి సీఎం ఎలాంటి వివరాలు తెలియజేయలేదు కానీ పలువురు తీవ్రంగా గాయపడ్డారని మాత్రం తెలిపారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందన్నారు.



# మహాకుంభమేళా తొక్కిసలాటపై తెలుగు రాష్ట్రాల సీఎంల సంతాపం

అమరావతి/హైదరాబాద్: మహాకుంభమేళాలో జరిగిన తొక్కిసలాట ఘటనపై తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు విచారం వ్యక్తం చేశారు. ఈ విషాద ఘటనలో ప్రాణాల కోల్పోయిన వారికి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాలో జరిగిన విషాద తొక్కిసలాట పట్ల ఏపీ సీఎం తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఎక్స్ వేదికగా సీఎం స్పందిస్తూ.. మహాకుంభ మేళా తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నానన్నారు. ఈ క్లిష్ట సమయంలో మనోధైర్యం కోల్పోకుండా వారికి ఓదార్పు కల్పించాలని కోరుకుంటున్నాను అంటూ ఎక్స్ వేదికగా చంద్రబాబు పోస్టు చేశారు.

**తెలంగాణ సీఎం రేవంత్ దిగ్భ్రాంతి** ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాలో తొక్కిసలాట ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనలో ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఆ కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం, ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం ఆదుకోవాలని, గాయపడినవారికి సరైన వైద్యం అందించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవసరమైన సాయం అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# దేశానికి గర్వకారణమైన రోజు.. ఇస్రో వందో ప్రయోగం విజయవంతంపై హరీశ్‌రావు

హైదరాబాద్ : ఇస్రో వందో ప్రయోగం విజయవంతంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో వందో రాకెట్ ప్రయోగం భారతదేశానికి ఒక గొప్ప విజయమని ప్రశంసించారు. జీఎస్ఎల్‌వీ-ఎఫ్15 రాకెట్.. ఎన్‌వీఎస్-02 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టిందని తెలిపారు. ఎన్వీఎస్-02 ఇస్రో శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన స్వదేశీ నావిగేషన్ ఉపగ్రహ వ్యవస్థ అని.. దీంతో మన సైంటిస్టుల ప్రతిభ అని పేర్కొన్నారు. దేశానికి గర్వకారణమైన రోజు ఇవాళ అని హరీశ్‌రావు ప్రశంసించారు. భారత నావిగేషన్ వ్యవస్థ నావిక్ సిరీస్‌లోని ఈ రెండో ఉపగ్రహం కచ్చితమైన పొజిషన్, వేగం, టైమింగ్‌తో భారత ఉపఖండం అవతల 1500 కి.మీ పరిధి వరకు యూజర్లకు కచ్చితమైన గమన సూచనలు(నావిగేషన్, ముఖ్యంగా నౌకాయానం) అందిస్తుంది. 50.9 మీటర్ల పొడవైన రాకెట్ జీఎస్ఎల్వీ-ఎఫ్12 మిషన్‌లో ఎన్‌వీఎస్-01 ఉపగ్రహాన్ని గతేడాది మే 29 విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశపెట్టింది. నేడు నింగిలోకి దూసుకెళ్లిన 2,250 కిలోల బరువైన ఎన్‌వీఎస్-02 శాటిలైట్‌ను యూఆర్ శాటిలైట్ కేంద్రంలో రూపొందించి అభివృద్ధి పరిచారు. ఇందులో రేజింగ్ పేలోడ్‌కు అదనంగా ఎల్1, ఎల్5 నావిగేషన్ పేలోడ్లు ఉన్నాయి. ఈ ఉపగ్రహం అందించే నావిగేషన్ సమాచారాన్ని గగనతల, భూతల, జల మార్గాల్లో ఉపయోగించుకోవచ్చు. విమానాల నిర్వహణకు, మొబైల్స్‌లో స్థాన ఆధారిత సేవలకు, ఉపగ్రహాల కక్ష్య నిర్ధారణకు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ఆధారిత అప్లికేషన్లకు, ఈ ఉపగ్రహపు నావిగేషన్‌ను వాడుకోవచ్చని ఇస్రో తెలిపింది.



# రాష్ట్రంలో ఏ సీఎం కూడా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదు

హైదరాబాద్: రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులను అర్హులందరికీ అందించకపోవడం సరైంది కాదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. రాష్ట్రంలో 12,991 గ్రామ పంచాయతీలు ఉండగా, మండలానికి ఒక గ్రామం చొప్పున 561 గ్రామాలను మాత్రమే ఎంపిక చేయడమేంటని ప్రశ్నించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బండి సంజయ్ బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన 70 లక్షల మంది రైతులుంటే.. ఇవాళ్టి వరకు 65 లక్షల మంది రైతుల ఖాతాల్లో డబ్బులే జమ చేయకపోవడం బాధాకరమన్నారు. 10 లక్షల మంది వ్యవసాయ కూలీలుంటే.. 9,80,000 మంది వ్యవసాయ కూలీల ఖాతాల్లో డబ్బులు వేయకపోవడమేంటని నిలదీశారు. "40 లక్షల కొత్త రేషన్ కార్డులిస్తామని 42,267 మందిని మాత్రమే గుర్తించడం హాస్యాస్పదంగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల కుటుంబాలు అర్హులైనప్పటికీ, నేటికీ ఒక్కరంటే ఒక్కరికి కూడా ఇంటిని నిర్మించకపోవడం సిగ్గు చేటు. ఇళ్ల నిర్మాణం కోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.7 వేల కోట్లకుపైగా కేటాయింపులు చేసినా.. నయాపైసా ఖర్చు చేయకపోవడం దారుణం. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటయ్యాక అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రులు ఎవరూ కూడా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోవడం బాధాకరం. ముఖ్యమంత్రే ఇచ్చిన హామీలనే అమలు చేయలేకపోతే.. మీ నేతృత్వంలో పనిచేసే అధికారులు ఏ విధంగా జవాబుదారీతనంతో పనిచేయగలరు? ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. ఇకనైనా అర్హులకు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇళ్లను అందించాలి" అని బండి సంజయ్ డిమాండ్ చేశారు.



# రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని విశ్వసించే ప్రభుత్వం మాది

హైదరాబాద్: భూమికి, విత్తనానికి మధ్య ఎలాంటి బంధం ఉందో.. రైతులతో కాంగ్రెస్ పార్టీకి అలాంటి బంధమే ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గతంలో భారాస ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష రుణమాఫీని కూడా ఏకకాలంలో చేయలేదని.. తద్వారా రైతులపై రూ.11,145 కోట్ల మేర వడ్డీ భారం పడిందన్నారు. గతంలో నాట్లు వేసే సమయం కాదు.. కోతల సమయానికి కూడా రైతుబంధు అందించలేదని విమర్శించారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని విశ్వసించే ప్రభుత్వం.. ప్రజా ప్రభుత్వం అని అన్నారు. ప్రజా ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో రూ.72 వేల కోట్ల (35 శాతం) నిధులు వ్యవసాయం, అనుబంధ రంగాలకు కేటాయించినట్లు తుమ్మల చెప్పారు. "పదేళ్ల భారాస పాలనలో తెలంగాణ రైతులు పడిన ఇబ్బందులు గమనించాం. వారి కన్నీరు తుడవడమే లక్ష్యంగా అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రైతు రుణమాఫీ చేశాం.

వరికి బోనస్.. మా ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసింది. సాగు చేసే రైతులకు నిజమైన భరోసా ఇవ్వాలనే లక్ష్యంతో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లాంటి పథకాలు ప్రారంభించాం. గత ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తంగా మారిన వ్యవసాయ రంగాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు కృషి చేస్తున్నాం. రైతును రాజును చేసేందుకు మా ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుంది. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయి" అని పేర్కొన్నారు.

# కేసీఆర్.. అసెంబ్లీకి వస్తారా? బాధ్యతలు వారికి అప్పగిస్తారా?: మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్: తాను నీతి, నిజాయతీకి మారుపేరని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు తన గురించి విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. గాంధీభవన్‌లో మంత్రులతో ప్రజల ముఖాముఖి అనంతరం ఆయన మాట్లాడారు. కేటీఆర్‌పై ఫార్ములా ఈ రేసు, ధరణి వంటి పలు కేసులున్నాయని విమర్శించారు. తనపై ఒక్క కేసూ లేదని.. గతంలో తెలంగాణ ఉద్యమ సమయంలో మూడేళ్ల మంత్రి పదవి వదులుకున్నట్లు చెప్పారు. ప్రతిపక్ష నాయకుడైన కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఆ పదవిని కేటీఆర్ లేదా హరీశ్‌రావు తీసుకోవాలన్నారు. అప్పుడు మాత్రమే వారికి సమాధానం చెబుతామన్నారు. "కేటీఆర్ ఓ ఎమ్మెల్యే మాత్రమే. అసెంబ్లీ ప్రతిపక్ష పార్టీకి డిప్యూటీ లీడర్ కాదు. వాళ్ల నాన్న పేరు చెప్పి ఎమ్మెల్యే అయ్యారు. ఆయనకు నేను సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. మూసీ ప్రక్షాళన అప్పుడు చేయలేదు.. ఇప్పుడు మేం చేస్తే అడ్డుకుంటున్నారు. యమునా నది కంటే మూసీ డేంజర్‌లో ఉంది. దిల్లీలో తమ ప్రభుత్వం రాగానే యమునా నదిని ప్రక్షాళన చేస్తామని భాజపా మ్యానిఫెస్టోలో ప్రకటించింది. ఇక్కడ మాత్రం మూసీని ప్రక్షాళన చేస్తామంటే కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ అడ్డుకుంటున్నారు. మూసీ కాలువ వెంట ఏసీ పెట్టుకుని గదుల్లో నిద్రపోయారు. కేంద్రంలో యమున, గంగ, సబర్మతి ప్రక్షాళన చేస్తామంటారు. మేం మాత్రం మూసీని ప్రక్షాళన చేయొద్దా? భారాస నేతలకు మూసీపై అవగాహన లేదు. కేటీఆర్, హరీశ్‌రావు దగ్గర దోచుకున్న సొమ్ము ఉంది. వాళ్లు కాకుండా కేసీఆర్ ప్రశ్నలు అడిగితే సమాధానం చెబుతా? 30 మంది సభ్యులు ఉండి మీరు అసెంబ్లీకి రావడంలేదు. కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదు. ఆయన వస్తారా? లేదంటే రాజీనామా చేసి ప్రతిపక్ష నేత పదవిని కేటీఆర్, హరీశ్‌రావుకు అప్పగిస్తారా?. భారాస సగం దుకాణం మూతపడింది. పార్లమెంటు స్థానాల్లో పోటీ చేసిన 16 స్థానాల్లో గుండు సున్నా రాగా.. ఏడింటిలో డిపాజిట్ పోయింది" అని కోమటిరెడ్డి విమర్శించారు.

# భవిష్యత్‌లో త్రిష మరింత రాణించాలి.. ఎమ్మెల్సీ కవిత ఆకాంక్ష



హైదరాబాద్ : మహిళల అండర్-19 టీ20 ప్రపంచ కప్ టోర్నీలో రికార్డు సెంచరీతో చరిత్ర సృష్టించిన తెలంగాణ బిడ్డ గొంగడి త్రిషకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అభినందనలు తెలిపారు. ప్రపంచ స్థాయిలో త్రిష సత్తా చాటడం మనందరికీ గర్వకారణం. భవిష్యత్తులో త్రిష మరింత రాణించాలని ఆకాంక్షిస్తున్నట్లు కవిత పేర్కొన్నారు. గత కొంతకాలంగా నిలకడగా రాణిస్తూ అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్న తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష.. మలేషియాలో జరుగుతున్న అండర్-19 మహిళల ప్రపంచకప్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. మంగళవారం స్కాట్లాండ్‌తో జరిగిన సూపర్ సిక్స్ పోరులో త్రిష (59 బంతుల్లో 110 నాటౌట్, 13 ఫోర్లు, 4 సిక్సర్లు) 53 బంతుల్లోనే శతకం బాది ఈ టోర్నీలో మొట్టమొదటి సెంచరీ చేసిన క్రికెటర్‌గా తన పేరును రికార్డుల పుస్తకాలలో సువర్ణాక్షరాలతో లిఖించుకుంది. త్రిషతో పాటు మరో ఓపెనర్ కమిలిని (42 బంతుల్లో 51, 9 ఫోర్లు) మెరవడంతో మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. నిర్ణీత 20 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 208 పరుగుల భారీ స్కోరు చేసిన సంగతి తెలిసిందే.

# సూర్యాపేట పరువు హత్య కేసులో ఆరుగురి అరెస్టు

సూర్యాపేట: సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగిన పరువు హత్య కేసులో బుధవారం ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. భార్గవి ఇద్దరు సోదరులు, నానమ్మ, నాన్న సహా ఆరుగురు అరెస్ట్ అయ్యారు. ఆరు నెలల క్రితం వడ్లకొండ కృష్ణ(30), భార్గవి ప్రేమ వివాహం చేసుకున్నారు. ప్రేమ పెళ్లి చేసుకున్నందుకు కక్షగట్టిన ఆమె సోదరులు కృష్ణను హత్య చేశారు. సోమవారం పిల్లలమర్రి కాల్వకట్టపై మృతదేహం లభ్యమైంది. కృష్ణను చంపుతానని పలుమార్లు భార్గవి సోదరుడు నవీన్ బెదిరించినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. పరువు హత్య కేసులో విస్తుపోయే నిజాలు వెలుగు చూశాయి. వడ్లకొండ కృష్ణను హత్య చేసేందుకు అతని భార్య భార్గవికి చెందిన కుటుంబ సభ్యులు నలుగురితో పాటు మరో ఇద్దరు పాల్గొన్నారు. సూర్యాపేటలోని జనగామ క్రాస్ రోడ్డు సమీపంలోని నిందితుల్లో ఒకరైన బైరు మహేశ్ వ్యవసాయ భూమి వద్ద ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని కారు డిక్కీలో వేసుకొని తెల్లవారుజాము వరకు షికారు చేశారు. చివరికి పిల్లలమర్రి సమీపంలోని మూసీ కాల్వకట్టపై మృతదేహాన్ని వదిలేసి నిందితులందరూ పరారయ్యారు.

**రెండు నెలలుగా ప్రణాళిక...** ఇష్టం లేకుండా తమ సోదరి భార్గవిని వివాహం చేసుకోవడంతో రెండు నెలలుగా కృష్ణను అంతం చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు. ఇందులో తాళ్లగడ్డకు చెందిన బైరు మహేశ్‌తో పాటు నల్గొండకు చెందిన మరో యువకుడి సాయం తీసుకున్నారు. ఇందులో భాగంగానే కొన్నాళ్లుగా కృష్ణతో.. మహేశ్ స్నేహం చేస్తున్నట్లు నటించాడు. ఈ పథకాన్ని ఈనెల 19న అమలు చేయాలని చూసినా.. కుదరక ఆదివారం రాత్రి హత్య చేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com